ప్రజాశక్తి

బుధవారం 14 డిసెంబర్ 2022 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (బుడా) ఏర్పాటుకు ..

మంత్రివర్గం ఆమోదం

బానట్ల నగరం

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా సమగ్రాభివృద్ధి ధ్యేయంగా జిల్లా మొత్తాన్ని కలపి బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (బుడా) ఏర్పాటుకు రాష్ట మంత్రివర్గ సమావేశం మంగళవారం ఆమోదం తెలిపింది. నూతనంగా ఏర్పాటైన బాపట్ల జిల్లాలో అధికభాగం గ్రామీణ ప్రాంతంగా ఉంది. బాపట్ల, చీరాల,రేపల్లె మున్సిపాలిటీలు, అద్దంకి నగర పంచాయతీ, 25 మండలాలు ఉన్నాయి. 461 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జిల్లాలో 1301.68 చదరపు కిలోమీటర్ల పరిధిలో రెండు అర్బన్ లోకల్ బాడీలు చీరాల, బాపట్లతో పాటు, 101 గ్రామాలు, 9 మండలాలతో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేశారు. ఈ మేరకు మూడు నెలల క్రితం జిల్లా అధికారులు అథారిటీ ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వ అనుమతి కోసం పంపగా మంత్రివర్గం అమోదం తెలిపింది. ఈ పాటికే ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఒడా)ను 2019లో ఏర్పాటు చేశారు. చీరాల మున్సిపాలిటీ, అద్దంకి నగర పంచాయతీతో పాటు ప్రస్తుత బాపట్ల జిల్లాలోని పలు మండలాలు ఉడాలో ఉన్నాయి. బాపట్ల జిల్లా విస్తీర్ణం 3,830 చ.కిమీ. 74 కిలోమీటర్ల సముద్రతీరం ఉంది. విద్యా కేంద్రంగా, పర్యాటక కేంద్రంగా, ఆక్వా రంగంలో బాపట్ల జిల్లా ప్రసిద్ధి పొందింది. చీరాల, నిజాంపట్నంలో ఫిషింగ్ హార్బర్‌లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అథారిటీ ఏర్పాటు ద్వారా అభివృద్ధి పనులు, నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు స్థానికంగానే లభిస్తాయి. బుడా ఏర్పాటు ద్వారా జిల్లా మొత్తానికి సంబంధించి ప్రణాళికా విభాగం, నూతన కార్యాలయం ఏర్పడతాయి. బుడా ఏర్పాటు ద్వారా కేంద్ర, రాష్ట ప్రభుతాలు మంజూరు చేసే నిధులతో అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం లభిస్తుంది. అథారిటీ ఏర్పాటు ద్వారా నూతన గృహాల నిర్మాణం, బాపట్ల జిల్లా సర్వతోముఖాభివద్ధికి దోహదపడుతుందని భావిస్తున్నారు.

దిక్కుతోచని రైతు..

- ప్రభుత్వ పాత్ర ఏమిటి?
- పంటలను పరిశీలించిన టిడిపి నేతలు

నీట మునిగిన వరి ఓదెలు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

నాలుగు రోజులపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు అన్ని పంటలూ తుడిచిపెట్టుకుపోయాయి. రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. చేతికందే పంట నీళ్ల పాలయింది. ఏం చేయాలో తెలియడంలేదు. ఏ పంట చేతికి వస్తుందో రాదో కూడా స్పష్టత లేదు. అన్నీ పంటలు నీటమునిగాయి. పెట్టిన పెట్టుబడులు నీటిపాలయ్యాయి. ఎకరాకు కనీసం రూ.50 వేలకు తగ్గకుండా నష్టం కనిపిస్తోంది. పంటతోపాటు పెట్టుబడులు పోయాయి. రైతులు దిగాలు పడ్డారు. ఇప్పటికే అప్పులు తీర్చేమార్గం లేక టంగుటూరు మండలంలో ఓ రైతు బలవన్మరణానికి ప్రయత్నం చేశాడు. పరిస్థితి ఇంత ఆందోళనగా ఉంది. పంట నష్టం అంచనాలకు అందడం లేదు. కోట్లలోనే జరిగింది. ప్రభుత్వం ఏ విధంగా రైతులను ఆదుకుంటుందనేదీ చూడాలి. భరోసా ఉంటుందా? లేదా?అన్నది ఆలోచించాలి. అధికారిక లెక్కల ప్రకారమే 31వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.ప్రాథమిక అంచనాలే ఇవీ. అయితే లక్ష ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లు అంచనా. ఎక్కడ చూసినా నీటిలోనే పంటలు తేలాడుతున్నాయి. రేపోమాపో కోతలకు వచ్చేవి కూడా నీటిపాలయ్యాయి.కలాల్లో ఆరపోసినవి తడిసి ముద్దయ్యాయి. మినుము, బొబ్బర్లు లాంటి పంటలు ఈపాటికే మొలకెత్తాయి. వరి తడిచిపోయింది. రంగుమారనుంది. మిర్చి విషయానికి వస్తే తీర్చేదికాదు. పంట కలాల్లోనే తడిచిపోయింది.పశ్చిమాన ఈ సీజన్‌లో పెద్దగా వర్షాల భయం ఉండదు. దీంతో రైతులు పొలాల్లోనే కలాలు ఏర్పాటు చేసుకుని మిర్చి ఎండబెట్టారు. అన్ని తడిచిపోయాయి. వాటిని కాపాడుకునేందుకు పడ్డ పాట్లు చెప్పేవికావు. ధాన్యం సాగర్ కృష్ణాడెల్టాలో పూర్తిగా నీటిపాలయింది. ఓదెలు నీటిలోనే ఉన్నాయి.నిజంగా రైతులకు తీర్చలేని నష్టం జరిగింది. ఈ తరుణంలో ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి. మంత్రి మేరుగ నాగార్జున వైపాలెం నియోజకవర్గంలో దెబ్బతిన్న వరిని పరిశీలిం చారు. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ప్రకటించారు. మిగతా పంటలకు నష్టం ఎలాభర్తీ చేస్తారన్నది చెప్పలేదు. ప్రభుత్వమైతే రైతులను ఏదో రకంగా ఆదుకోకుంటే అప్పుల్లో కూరుకుపోతారు. ఇదిలా ఉండగా జిల్లాలో పలు ప్రాంతాల్లో టిడిపి నేతలు పర్యటించారు. వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులను ఆదుకోవాలని కోరారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామితో కలిసి టంగుటూరు మండలంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్ధన్‌రావు ఒంగోలు మండలంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. నియోజకవర్గాల్లో టిడిపి నేతలు పర్యటించారు. పలుచోట్ల సిపిఎం, రైతు సంఘం నేతలు పంటలను పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.

పారదర్శకంగా పంట నష్టం నమోదు

- అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు
- కలెక్టర్ దినేష్ కుమార్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

తుపాన్ కారణంగా దెబ్బతిన్న పంటల వివరాల నమోదులో ఎలాంటి లోపాలు లేకుండా పారదర్శకంగా ఉండాలని కలెక్టర్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పంటలపై తుఫాను ప్రభావం, ఇతర రెవెన్యూ అంశాలపై ఆయన సమీక్షించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలించి సంబంధిత రైతుల సమక్షంలో నష్టపోయిన పంటల వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. తహశీల్దారు, మండల వ్యవసాయ అధికారి కచ్చితంగా తమ పరిధిలోని అన్ని గ్రామాలలో పర్యటించాలని ఆదేశించారు. పంటల వివరాల సేకరణకు సంబంధించి ముందుగానే గ్రామాలలో దండోరా వేయించాలన్నారు. నమోదు అనంతరం ఆ వివరాలను సోషల్ ఆడిట్ కోసం రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించాలని దిశా నిర్దేశం చేశారు. ఈ ప్రక్రియలో నిర్లక్ష్యం వహించినా, అవకతవకలకు పాల్పడినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. నష్టపోయిన ప్రతి రైతుకూ న్యాయం జరిగేలా పనిచేయాలని పునరుద్ఘాటించారు. రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్నా నివత్తి చేసేలా జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో 83310 57048 ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. రంగు మారిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. మద్దతు ధర కంటే తక్కువ రేటుకు ఎవరూ బహిరంగ మార్కెట్‌లో పంటలను విక్రయించవద్దని రైతులకు కలెక్టర్ సూచించారు. ల్యాండ్ ఆడిట్‌లో ఎలాంటి లోపాలు లేకుండా పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కోర్టు కేసులు లేని చోట ఇళ్ల పట్టాల పంపిణీ వేగవంతం చేయాలన్నారు. పట్టాలు పొందిన లబ్ధిదారులందరూ త్వరగా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా చూడాలని ఆదేశించారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని విడుదల చేయడంపై ప్రత్యేక దష్టి పెట్టాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో సరైన కారణం లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధింత తహశీల్దారును సస్పెండ్ చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు.ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్, డిఆర్ఒ బి. చిన ఓబులేసు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గోపీచంద్, పౌర సరఫరాల సంస్థజిల్లా మేనేజర్ గ్లోరియా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న మిరప మొక్కలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం

కక్షపూరితంగా వ్యవహరిస్తోంది

- పొగాకు రైతులకు రూ.50 వేల వడ్డీ లేని రుణం ఇవ్వాలి
- మాజీ మంత్రి సోమిరెడ్డి

ప్రజాశక్తి-టంగుటూరు

రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని వ్యవసాయ శాఖ మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. మండల పరిధిలోని తూర్పునాయుడుపాలెం సమీపంలోని ఐఒసి ఎదురుగా ఉన్న దామచర్ల సత్య కార్యాలయంలో రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపి నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన రైతులు తాము సాగు చేసిన పంట వివరాలు, పెట్టుబడులు, ప్రస్తుత పంటల దుస్థితి, నష్టం వివరాలను వివరించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ తుపాన్ ప్రభావంతో దాదాపు పంటలన్నీ తుడిచి పెట్టుకు పోయాయన్నారు. పొగాకుకు అధిక నష్టం జరిగిందన్నారు. తనకు అందిన నివేదికల ప్రకారం ప్రకాశం, నెల్లూరు ఉమ్మడి జిల్లాల పరిధిలో 1.35 లక్షల ఎకరాలలో ▶ 2లో

రైతులపై రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

పొగాకు పూర్తిగా నీట మునిగి పనికి రాకుండా పోయినట్లు తెలిపారు. దీంతో రూ.600 కోట్ల రైతుల పెట్టుబడితో పాటు రైతులకు చేతికి అందాల్సిన ప్రయోజనం రూ.1500 కోట్లు మొత్తాన్ని నష్టపోయారని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రాప్ నమోదు స్థానిక వైసిపి నాయకులు చెప్పినట్లుగానే పక్షపాతంగా జరుగుతుందని సోమిరెడ్డి ఆరోపించారు. పొగాకు రైతులకు రూ. 50 వేలు వడ్డీ లేని రుణం ఇచ్చి ఆదుకోవాలన్నారు. పొగాకు బోర్డు తరపున బ్యారన్‌కు రూ.50వేల వడ్డీ లేని రుణాన్ని రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పొగాకు, మిర్చి, వరి, శనగ, మినుము పంటలకు కేంద్ర, రాష్ట్రాల భాగస్వామ్యంతో నష్టపరిహారం అందజేసి రైతులను ఆదుకోవాలని సోమిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం శివపురం, కాకుటూరువారిపాలెం పరిధిలోని పొగాకు, తదితర పంటలను సోమిరెడ్డి, టిడిపి నాయకులు పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, టిడిపి కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, దామచర్ల వెంకట కష్ణారావు, తూర్పునాయుడుపాలెం సర్పంచి తల్లపనేని రవికుమార్, నాయకులు కాట్రగడ్డ అనిల్, కామని నాగశ్రీను, టిడిపి నాయకులు, పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలపై మాగుంట ప్రశ్న

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మత్స్య సంపదకు మౌలిక సదుపాయాల కల్పన, మత్స్యకారులకు ప్రభుత్వం అందించే చర్యలపై ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర మత్స్య, పశు సంరక్షణ పాడి పరిశ్రమ శాఖ మంత్రి పర్శోత్తం రూపాల సమాధానమిస్తూ మత్స్య సంపద సేకరణ, ప్యాకింగ్, శీతల సదుపాయం, నిల్వ వసతులు మరియు రవాణా వాహనాల లాటి వసతుల ఏర్పాటుకు దేశంలోని మత్స్యకారులకు మత్య శాఖ, పశు సంరక్షణ, పాడి పరిశ్రమ మంత్రిత్వ శాఖ ప్రధాన్ మంత్రి మత్స్యసంపద యోజన పథకంలో రాష్ట్రాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు.



బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

పేదల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గిద్దలూరు

పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అన్నా రాంబాబు తెలిపారు. గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని రాచర్ల రోడ్డు సచివాలయం పరిధిలోని 19,20 వార్డుల్లోని వీధుల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడపగడకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకొని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేయడంతో పాటు అభివద్ధికి తగిన ప్రాధాన్యం ఇస్తూ ముఖ్య మంత్రి జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. జగనన్న ప్రవేశ పెట్టిన అనేక రకాల సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరూ లబ్ధి పొందారన్నారు. కుల,మతాలు పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల వారికీ వైసీపీ పాలనలో ఆర్థిక భరోసా కల్పించడం జరిగిందన్నారు. జగనన్న పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. నవరత్నాలు పథకాలతో ప్రతి గడపలో ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ముఖ్య నాయకులు గోనా రంజిత్, నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య,కౌన్సిలర్ సాయిపోగు రిబ్కా, కో-ఆప్షన్ సభ్యులు షేక్ మస్తాన్ వలి, సర్పంచ్ ఎస్ రాజమ్మ ,వైసీపీ నాయకులు,కార్యకర్తలు, అధికారులు,సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

బురదమయంగా రహదారులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

తుపాను ప్రభావంతో గత రెండు రోజులుగా కురిసిన వర్షానికి యర్రగొండపాలెంలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. ప్రధానంగా పడమర బజార్, ఇందిరా నగర్, శివాలయం, పుల్లమ్మ చేను, ఎన్‌జిఒ కాలనీలలో రోడ్లపై నిలిచి బురద మయంగా మారింది. వీధుల లో డ్రైనేజీ సౌకర్యం సక్రమంగా లేకపో వడంతో అరకొరగా ఉన్న డ్రైనేజీ కాలు వలు వ్యర్థాలతో నిండిపోయాయి. వీధులన్నీ దుర్గంధం వెదజ ల్లుతున్నాయి. దోమ లకు ఆవాస కేం ద్రాలుగా మారాయి. దోమల కార ణంగా మలేరియా, డెంగ్యూ, వాంతులు, విరేచనాలు లాంటి వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని ప్రజలు భయాందోళనలు చెందు తున్నారు. రోడ్లపై నిలువ ఉన్న నీటిని తొలగించే ఏర్పాటు చేసి డిడిటి, బ్లీచింగ్, ఎబెట్ ద్రావణాన్ని పిచికారి చేయిం చాలని వారు కోరుతున్నారు.

పడమర బజారులో నిలిచిన వర్షపు నీరు

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు..

విద్యుత్ సర్వీసులపై విజిలెన్స్ అధికారుల దాడులు..

రూ.8.23 లక్షలు జరిమానా

జరిమానాలను వెల్లడిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలో విద్యుత్ వినియోగంలో ఎవరైనా అక్రమ చౌర్యానికి పాల్పడితే అపరాధ రుసుముతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ విజిలెన్స్ డిఇఇ తోట శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం మండలం లోని 16 గ్రామాల పరిధిలో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు 31 బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో విద్యుత్ అక్రమ చౌర్యాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 227 సర్వీస్‌లను అధికారులు తనిఖీ చేయగా వారిలో ఇద్దరు డైరెక్ట్ ట్యాపింగ్, మాల్ ప్రాక్టీస్ నలుగురు, అదనపు లోడును అక్రమంగా వినియోగిస్తున్న 221 మంది మొత్తం 227 సర్వీసులను గుర్తించి వారి నుండి రూ8.23 లక్షలు జరిమానా విధించారు. అనంతరం స్థానిక సబ్ స్టేషన్ కార్యాలయంలో అపరాధ రుసుము వివరాలను వెల్లడించారు. విద్యుత్‌ను సక్రమంగా వినియోగించి అధికారులకు సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ డిఇఇతో పాటు ఎపిసిపిడిసిఎల్ ఆపరేషన్ డిఇఇ పాలగిరి శ్రీనివాసులు, డిఇఇలు రాయపాటి మోహన్ రావు, వినయ్ కుమార్ రెడ్డి, శ్రీనివాసులు, టంగుటూరు పట్టణ, రూరల్ ఎఇఇలు పి రామకష్ణ, ఎం వెంకటేశ్వర్లు సహా మరో 9 మంది ఏఈలు, విద్యుత్ శాఖ సిబ్బంది దాడులలో పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన వాయిదా

ప్రజాశక్తి-దరిశి

ఈనెల 15న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ కుమారుడి వివాహ రిసె ప్షన్ ఫంక్షన్‌కు రావాల్సి ఉండగా, తుఫాన్ కార ణంగా ఫంక్షన్‌ను వాయిదా వేసిన కారణంగా ముఖ్యమంత్రి పర్యటన కూడా వాయిదా పడిందని ఎమ్మెల్యే సోదరుడు మద్దిశెట్టి శ్రీధర్ తెలిపారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాల యంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివాహ రిసెప్షన్ ఎప్పుడు నిర్వహించేది త్వరాత ప్రకటిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసి చైర్మన్ సుబ్బయ్య, ముండ్లమూరు జడ్‌పిటిసి రత్నంరాజు, రాష్ర కార్పోరేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు వెన్న పూస వెంకటరెడ్డి, మున్సిపల్ కౌన్సిలరు విసి రెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మద్దిశెట్టి శ్రీధర్

14న ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

డాక్టర్ మోటూరి ఉదయం జయంతి సందర్భంగా ఈనెల 14న మంగమూరు రోడ్డులోని బెతూన్ నర్సింగ్ హోంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి కోరారు. ఈ సందర్భంగా కేన్సర్ వ్యాధి రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన, ఇతర వ్యాధుల పట్ల అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కొన్ని స్క్రీనింగ్ టెస్టులు ఉచితంగా చేస్తారని తెలిపారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండలంలోని మిల్లంపల్లి గిరిజన గురుకుల కళాశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రాజబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 20వ తేదిలోపు కళాశాలలో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ 8919295952 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రకటన

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు :: తణుకు

O.S.No. 242/2019

బిట్వీన్:

కర్రి వెంకట రామ చంద్రారెడ్డి ...వాది

AND

ఇంగ్ల ఆదిలక్ష్మి & 3 Others ...ప్రతివాదులు

D-2: ఇంగ్ల హైమావతి, భర్త: లేటు సుబ్బారావు, డో.నెం. 4-162, కల్లూరు (మం), బాపట్ల జిల్లా.

D-3: ఇంగ్ల గోవిందు, తండ్రి: లేటు సుబ్బారావు, డో.నెం. 4-162, కల్లూరు (మం), బాపట్ల జిల్లా.

D-4: ఇంగ్ల రాము, తండ్రి: లేటు సుబ్బారావు, డో.నెం. 4-162, కల్లూరు (మం), బాపట్ల జిల్లా.

పై నెంబరు దావాలో 2 టు 4 ప్రతివాదులైన మీపై ఎన్నిమార్లు దావా సమన్లు పంపిననూ అమలు కానందున మీ హాజరు నిమిత్తం పై కోర్టు వారి ఎదుట **ది.29-12-2022 సం॥రం తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా లేదా అడ్వకేట్ ద్వారా హాజరై మీ వాదనను దాఖలు చేసుకోవలెను.** లేని ఎడల మీ పరోక్షమున దావా తీర్మానించబడును అని తెలియపర్చడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కె.జనార్థన్ రెడ్డి, అడ్వకేట్,
తణుకు. సెల్: 93971 12777

కోర్టు నోటీసు

మహారాజశ్రీ బాపట్ల సీనియర్ సి విల్ జడ్జి వారి కోర్టులో

IP No :14/2022

Between:-

పాలపర్తి కిరణ్ @ కిరణ్ కుమార్ .....పిటీషనర్

V/S

1) చొక్కాకుల ప్రవీణ్ కుమార్,.
2) మరుప్రోలు చెన్నకేశవరెడ్డి ...రెస్పాండెంట్స్.

పై నెంబర్ పిటిషనులో పిటిషరు రెస్పాండెంట్స్ తాలూకు బాకీలను ఆర్థిక ఇబ్బందులు వల్ల చెల్లించకపోయినందున అతనికి ఎలాంటి స్థిర చరాస్తులు లేనందున పై నెంబరు ఐపి పిటిషన్ దాఖలు చేసి ఉన్నాడు. సదరు పిటీషనరు యొక్క స్థితి గతులను గురించి రెస్పాండెంట్స్ కానీ ఇతరులకు గాని తెలిసిన యెడల ది: 21-12-2022 న ఉదయం 10:30 గంటలకు స్వయంగా గాని లేక మీ వకీలు ద్వారా గాని మీ ఆక్షేపణలు ఏమైనా ఉన్న యెడల పై కోర్టు లో హాజరై తెలియ జేయగలరు. లేనియెడల మీ పరోక్షమున శ్రీ కోర్టు వారు తీర్మానించెదరని ఇందుమూలముగా తెలియ జేయడమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేదీ: 21- 12-2022 . ఇట్లు

ఎస్‌కె.జడ్.బాషా,
కె.రవి.ఎస్.కె మన్సూర్,
అడ్వకేట్స్, బాపట్ల.

In The court of the senior civil judge Bapatla.

I.P.NO:21/2022

Between:

Yaram Prasad Rao, S/o Yanadi,R/o Yaram vari palam (vil) PedagollaPalem panchayat, kallapalem mandalam, Bapatla district ,AP ...... Petitioner.

R) Pandaraboina srirama murthy, S/o Kotaiah,R/o Nakkala Varipalem(Vil) Karlapalem, (mdl), Bapatla district ,AP.

2) official, receiver, Guntur, Guntur district, ...Respondents.

ఈ నెంబరులో పిటీషనరు అయిన యారం ప్రసాద్, తండ్రి యానాది గారు రెస్పాండెంట్స్ పై డేటార్ I.P.(దివాలా పిటిషన్) దాఖలు చేసుకుని యున్నారు. వాయిదా 21- 12-2022 నకు ఉంది. ఇంకా యారం ప్రసాద్ గార్కి అప్పులు ఇచ్చియుండిన యెడల వాయిదా రోజు 10 : 30 గంటలకు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా శ్రీ కోర్టుకు హాజరు అయి మీ యెక్క ఆక్షేపణలు తెలుపు కోవలెను. లేనియెడల పిటీషనరు కోరిన విధంగా తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేదీ: 21-12-2022. ఇట్లు.

డి.భాస్కరరావు,
అడ్వకేట్, బాపట్ల
సెల్:9441129989.

మహారాజశ్రీ చీరాల ప్రిన్సిపల్ సివిల్ జడ్జివారి కోర్టులో

O.S.No.176/2020.

బిట్వీన్:

చుండూరి సతీష్ .....వాది

వర్సెస్

చేజెర్ల లక్ష్మణ్ కుమార్ .... ప్రతివాది

TO:

చేజెర్ల లక్ష్మణ్ కుమార్, S/o. ఆదినారాయణ, హిందూ, వయస్సు 32 సంవత్సరములు. ప్రభుత్వ ఉద్యోగి, C/o. గరిక కళ్యాణి, కామాక్షి కేర్ హాస్పిటల్ వెనుక, భావనరుషిపేట, పేరాల, చీరాల గ్రామము మరియు మండలం, బాపట్ల జిల్లా-523157.

పై నెంబర్ దావాలో వాది మీ మీద రికవరీ అఫ్ మనీ కోసం దావా దాఖలు చేసి వున్నారు. సదరు దావాలో మీకు ఎన్ని మార్లు సమన్లు పంపిన సదరు సమన్లు ముట్టక కాలయాపన చేయుచున్నారు అని శ్రీ కోర్టు వారు భావించి సదరు నోటీసు ఈ ప్రకటన ద్వారా జారి అగుటకు ఉత్తర్వులు జారీచేసి యున్నారు. కావున మీకు పై నెంబర్ గల దావాలో ఎటువంటి ఆక్షేపణలు ఉన్న ఎడల ది. 15-12-2022 ఉదయం 10.30 నిమిషాలకు పై కోర్ట్ వారి ఎదుట మీరు గాని మీ తరపున న్యాయవాది గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనవలసినది. లేని యేడల మీ పరోక్షమున దావా విచారించి తీర్మానింప బడునని తెలియపరచడం అయినది.

(కోర్ట్ వారి ఉత్తర్వుల మేరకు)

హియరింగ్ తేది : 15-12-2022 ఇట్లు

శ్రీకాంత్ ఠాకూర్,
రామకృష్ణ ఠాకూర్,
యం. అశోక్ కుమార్,
ఆర్. మోహనరాణి,
రామకృష్ణ, యం.
జి. సురేష్
కే .నవీన్
న్యాయవాదులు,
C/o. THAKURS OFFICE,
చీరాల.

రైతులకు న్యాయం చేస్తాం: మోపిదేవి

ప్రజాశక్తి-చెరుకుపల్లి

మాండూస్ తుఫాను వల్ల నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూస్తామని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. మంగళవారం చెరుకుపల్లి మండల పరిధిలోని గుళ్లపల్లి, పొన్నపల్లి, ఆరేపల్లి గ్రామాలలో పంట నష్టం వివరాలను ఆయన పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తామని, పంట నష్టం వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. మాండూస్ తుఫాను వలన కురిసిన భారీ వర్షాలతో తీర ప్రాంత నేతలకు అధిక నష్టం వాటిల్లిందని, వీరందరికీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితో మాట్లాడి తగిన న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇప్పటికే నష్టపోయిన రైతులకు రెండో పంట వేసుకునేందుకు 80 శాతం సబ్సిడీపై విత్తనాలు అందించేందుకు ముఖ్యమంత్రి ఆదేశించారని, పంట నష్టపోయిన ప్రతి ఒక్కరి ధాన్యాన్ని కొనుగోలు చేసి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు మత్తి దివాకర రత్నప్రసాద్, జడ్పిటిసి సభ్యులు మర్రివాడ వెంకట పావని ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ సత్తార్, రేపల్లె వ్యవసాయ శాఖ ఏడి ఎస్‌హెచ్ హుస్సేన్, తహసిల్దార్ టి ప్రశాంతి, ఇన్‌చార్జి ఏఈ మీరయ్య, మాజీ ఎంపీపీ చెన్ను కోటేశ్వరరావు, బండారు రామారావు తదితరులు పాల్గొన్నారు.

నగరం: మండూస్ తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రతి రైతును జగనన్న ప్రభుత్వం ఆదుకుంటుందని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. శుక్రవారం నగరం మండలంలో తుఫాన్ కారణంగా పంట మునిగిపోయిన పొలాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట వున్న అధికారులను పంట నష్టంపై ఆరా తీశారు. మండలంలోని 24,470 ఎకరాలలో వరి పంట వేయగా 7,600 ఎకరాల్లో పైర్లు నేలకొరిగాయని, 1,349 ఎకరాల్లో పంట కోత కోయగా 740 ఎకరాలు తుఫాన్ కారణంగా ఓదెలు నీట మునిగినట్లు వ్యవసాయాధికారి రమేష్ బాబు ఆయనకు తెలిపారు. ఏ ఒక్క రైతు కూడా నష్టపోకుండా నష్టాన్ని నమోదు చేయాలని వారికి ఆదేశించారు. రైతులు ఆర్‌బికే ద్వారా పంటను అమ్ముకోవచ్చునని ఆయన అన్నారు.

ఆర్‌డిఒ సందర్శన

రేపల్లె ఆర్డీవో పార్థసారథి మంగళవారం తుఫాన్‌కు నష్టపోయిన రైతుల పొలాలను సందర్శించారు. ప్రభుత్వం

చెరుకుపల్లి మండలంలో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణా రావు

నష్టపోయిన రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటుందని, తడిసిన ధాన్యాన్ని ఆర్‌బికేలో కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. గిట్టుబాటు ధర ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ చింతల శ్రీకష్ణయ్య, జడ్పిటిసి నాగమణి, ఎంపీటీసీ వెంకటేశ్వరరావు, సర్పంచ్ ఇంకొల్లు రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరు: తుఫాను వల్ల నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. మండలంలోని తూర్పు కొప్పెరపాడు, చందలూరు, గ్రామాల్లో మాండూస్ తుఫాన్ ధాటికి దెబ్బతిన్న పంటలను, మంగళవారం కృష్ణ చైతన్య పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నుంచి సాయం అందుతుందని తెలిపారు. గ్రామాల్లో మిర్చి, మినుము, శనగ, మొక్కజొన్న, పొగాకు, పంటలను ఆయన పరిశీలించారు. రైతు భరోసా కేంద్రం నుంచి, గ్రామంలో ఎంత మంది రైతులు పండించే పంటలను ఈక్రాప్ జరిగిందో, అన్న విషయంపై ఆరా తీశారు. తూర్పు కొప్పెరపాడు గ్రామానికి చెందిన రైతులు, ఆ గ్రామ విఏఏపై ఆరోపణలు చేశారు. గ్రామంలో రైతులకు ఎప్పుడూ అందుబాటులో ఉండడని, ఈక్రాప్ కూడా ఇష్టానుసారంగా చేస్తూ మందుల కోసం కట్టిన డబ్బులు వాడుకున్నాడని ఆరోపించారు. విఏఏ తన పద్ధతి మార్చుకోవాలని, లేకుంటే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని కృష్ణ చైతన్య హెచ్చరించారు. మండలంలో పంట నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖాధికారి జెన్నమ్మ, అద్దంకి ఉద్యానవన శాఖ అధికారి దీప్తి, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రాయిని వెంకటసుబ్బారావు, ఎంపీడీవో రమణమూర్తి, పిఆర్ ఏఈ రాంకుమార్, రైతులు ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

బాపట్ల రూరల్: మండూస్ తుఫాను వల్ల నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి అన్నారు. బాపట్ల మండలంలోని అప్పికట్ల, భర్తిపూడి, ఈతేరు, గోపాపురం, గుడిపూడి గ్రామాల్లో దెబ్బతిన్న పంట పొలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. మొత్తం ఎంత మేర నష్టం వాటిల్లింది పూర్తి వివరాలు సేకరించి నివేదికలు ప్రభుత్వానికి అందజేయాలని అధికారులకు సూచించారు. అలాగే నాణ్యత లోపించిన పంటను సైతం కొనుగోలు జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు ఆయా శాఖల అధికారులు, గ్రామాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకి: తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తహశీల్దార్ జీవి సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులకు పంట నష్ట గణనపై వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణతో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం గోనె సంచులు, రవాణా ఉచితంగా అందిస్తున్నదని, రైతులు ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించుకోవచ్చని తెలిపారు. వర్షాలకు నష్టపోయిన వరి, మినుము, శనగ, మొక్కజొన్న పంటలను 18వ తేదీ లోపు జాబితాను అందించాలని కోరారు. వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ శనగ నష్టపోయిన రైతులకు రాయితీపై శనగలు అందిస్తారని తెలిపారు.

భట్టిప్రోలు: మాండూస్ తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు గత నాలుగు రోజులుగా వరి ఓదెలు నీటిలోనే నానుతున్నాయి. ప్రతి రోజూ ఏదో ఒక సమయంలో వర్షం పడుతూనే ఉంది. వర్షం తగ్గి ఎండ కాస్తే ఓదెలు తిప్పుకోవచ్చు అనుకునే వారికి ఏరోజుకారోజు నిరాశే మిగులుతోంది. దీంతో నీటిలో నానుతున్న గింజలు మొలకెత్తుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలాఉండగా కోతలు కోయని పంట ఆలస్యం కావటంతో కంకే ఎండిపోయి విరిగిపోతుందని వాపోతున్నారు. వర్షాలు తగ్గి కోతలు కోసినా సగానికి పైగా రెల్లవిరిగే ప్రమాదం ఉందని అంటున్నారు.

అంతేకాక వర్షాలకు నేలవాలిన పైరు కోత కోయటానికి కూలి రేట్లు కూడా అదనంగా చెల్లించాల్సి ఉంటుందని, అన్ని విధాలా నష్టాలను చవిచూడాల్సి వస్తుందని అంటున్నారు.

నీట మునిగిన శనగ

4వేల ఎకరాల్లో పంట నష్టం

ప్రజాశక్తి-పంగులూరు

ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు, శనగ పైరు పూర్తిగా మునిగిపోయింది. ఎన్నో ఆశలతో సాగుచేసిన రైతాంగాన్ని కూడా ఈ పంట నిలువున ముంచేసింది. గత సంవత్సరం మిర్చి పంటకు, తామర పురుగు సోకి, మండలంలోని మిర్చి రైతాంగం మొత్తం విపరీతంగా నష్టపోయారు. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి, పైసా తిరిగి రాక అప్పుల పాలయ్యారు. మరలా మిర్చి వేసి అప్పుల పాలు కాకూడదనే ఆలోచనతో, ఎక్కువ మంది రైతాంగం శనగవైపు మొగ్గు చూపారు. మండలంలో సుమారు 4,000 ఎకరాల్లో శనగ పైరును సాగు చేశారు. రబీలో సాగు చేసిన ఈ శనగ పైరు వాతావరణ పరిస్థితులు బాగా అనుకూలించి, మంచి ఏపుగా పెరుగుతున్న దశలో, గత శుక్రవారం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో, వర్షపు నీటికి పైర్లు మొత్తం మునిగిపోయాయి. ఐదు రోజుల నుంచి నీళ్లలో నానిపోయి ఉండటం, మంగళవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి మునిగిపోవడం వలన, పైరు పనికిరాకుండా పోతుందని రైతులు చెబుతున్నారు. పైరును పూర్తిగా తొలగించాల్సిందేనని రైతులు అంటున్నారు. ఇప్పటివరకు ఎకరాకు సుమారు 25 వేల రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతాంగం, ఒక పైసా కూడా తిరిగిరాదని, పైరును చెడగొట్టి, మళ్లీ సాగు చేసుకోవాల్సిందేనని

వర్షానికి మునిగిన శనగ పైరు

అంటున్నారు. కౌలు రైతులు కూడా భారీగా నష్టపోయినట్లు చెబుతున్నారు. ఎకరా రూ.20 నుంచి రూ.25 వేల వరకు కౌలుకు తీసుకొని, మరో 25 వేల రూపాయలు పెట్టుబడులు పెట్టామని, ఇప్పుడు పైరులు చూస్తే ఆందోళన కలుగుతుందని, కౌలు రైతులు చెబుతున్నారు. అధికారులు నష్టపోయిన శనగ రైతులకు, 80 శాతం సబ్సిడీతో శనగలు ఇస్తామని చెబుతున్నా రైతులు మాత్రం దానివల్ల ఉపయోగం లేదని, నష్టపరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. రబి సీజన్ ప్రారంభమై రెండు నెలలుగా వస్తున్న, ఇంతవరకు రబి పంటలకు ఈ క్రాప్ చేయలేదని, అడిగితే ఇంతవరకు ఈ క్రాప్ సైట్ ఓపెన్ కాలేదని చెబుతున్నారని, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రబీ ఈ క్రాప్ చేయాలని, కౌలు కార్డుతో సంబంధం లేకుండా కౌలు రైతులకు కూడా ఈ క్రాప్ చేయాలని, వెంటనే అధికారులు ఎన్యూమరేషన్ చేసి, నష్టపరిహారం చెల్లించాలని, రైతులు, కౌలు రైతులు కోరుతున్నారు.

వాలంటీర్ యజ్జల బాబ్జిని సత్కరిస్తున్న ఎంపీడీవో నేతాజీ

నేషనల్ వర్క్ షాప్‌నకు వాడరేవు వాలంటీరు

ప్రజాశక్తి-చీరాల: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన (ఆపద మిత్ర వాలంటీర్ స్కీం) జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 8,9 తేదీల్లో అస్సాంలో జరిగిన నిర్వహించిన నేషనల్ వర్క్ షాప్‌నకు వాడరేవు గ్రామ పంచాయతీ వాలంటీర్ యజ్జల బాబ్జి జాతీయ స్థాయిలో ప్రతిభను చాటి పలువురి ప్రశంసలను అందుకుంటున్నారు. విపత్తుల సమయంలో ప్రజలకు మరింత చేరువగా ఉండి సేవలను అందించే ఉద్దేశంతో ఆపదమిత్ర వాలంటీర్ స్కీం ద్వారా దేశవ్యాప్తంగా సుమారు లక్షమందికి శిక్షణ ఇవ్వాలనే ఉద్దేశంతో అక్టోబర్ 11 నుంచి 22 వరకు బాపట్ల విస్తీర్ణ శిక్షణ కేంద్రంలో ఆపదమిత్ర వాలంటీర్ సెక్షన్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో శిక్షణకు ఏడుగురు వాలంటీర్లు గతంలో హాజరయ్యారు. అందులో భాగంగా 19వ తేదీన వాడరేవు గ్రామంలో ప్రాక్టికల్ సీసన్ జరపటంతో వాడరేవు గ్రామ వాలంటీర్లు శిక్షణలో మెరుగైన ప్రదర్శనను చూపి ప్రతిభను కనబరిచి మొదటి బహుమతి సాధించారు. ఈ తరుణంలో రాష్ట్రవ్యాప్తంగా జాతీయ విపత్తుల సంస్థ నిర్వహించిన వర్క్‌షాప్‌లో ముగ్గురు ఎంపిక కాగా అందులో వాడరేవుకు చెందిన గ్రామ వాలంటీర్ ఎజ్జల బాబ్జి ఎంపిక అవడం విశేషం. ఈ తరుణంలో ఈనెల 8,9 తేదీలలో అస్సాంలో జాతీయ స్థాయిలో జరిగిన వర్క్ షాప్‌లో బాబ్జి పాల్గొని ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నేతాజీ, వాడరేవు పంచాయతీ కార్యదర్శి చక్రవర్తి జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన వాలంటీర్ యజ్జల బాబ్జిని ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది సన్నిహితులు పాల్గొన్నారు.

సమాజ మార్పునకు అందరూ కృషి చేయాలి

ప్రజాశక్తి-చీరాల

సమాజంలో మార్పు జరగాలంటే ప్రతి ఒక్కరూ విలువలతో నడుచుకోవాలని చీరాల భగవాన్ సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు పేర్కొన్నారు. సమితి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రియ పాఠశాల విద్యార్థులతో విలువలతో కూడిన నడక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అంశాల గురించి విద్యార్థులు తెలుసుకోవాలని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సమాజ మార్పునకు కృషి చేయాలని అన్నారు. అందరికీ సహాయపడే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ రమణమ్మ

చదువుతోపాటు క్రీడలలో రాణించాలి

ప్రజాశక్తి-చీరాల: చదువుతోపాటు విద్యార్థినులు క్రీడలలో కూడా పాల్గొంటూ ప్రతిభను చాటాలని, తద్వారా ఉద్యోగాలకు అవి ఎంతగానో దోహదపడతాయని కళాశాల ప్రిన్సిపాల్ వైఎ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ రమణమ్మ పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా అథ్లెటెక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొన్ని రోజుల క్రితం కొత్తపట్నంలో జిల్లా స్థాయి పరుగుపందెం పోటీల సెలెక్షన్స్ (10కె) జరిగాయి. ఇందులో చీరాల మహిళా కళాశాలకు చెందిన విద్యార్థినులు పలు విభాగాల్లో సత్తా చాటారు. అండర్ 20 జూనియర్స్ విభాగంలో డి బ్యూలా, పి నాగలక్ష్మి, షేక్ షర్మిల, పీవీ ఐశ్వర్య, కె దుర్గాభవానీ ఎంపికయ్యారు. అదేవిధంగా అండర్ 18 విభాగంలో స్వాతి, సీనియర్ విభాగంలో ఎన్ రమ్య, పీవీ మేఘన, పి గాయత్రి, డి త్రివేణి సెలెక్ట్ అయ్యారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ నుంచి వచ్చిన జ్ఞాపికలను, పత్రాలను మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రిన్సిపల్ రమణమ్మ అందజేశారు. ఇదేవిధంగా పోటీల్లో సత్తాచాటి కళాశాలకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షిచ్చారు. కార్యక్రమంలో పీడీ నీలాకుమారి, కోచ్ ఎం వేణు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఎంఇఓ

సైన్స్ ఎగ్జిబిషన్ విజేతలకు ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్: బాపట్ల మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ మంగళవారం ఏబీఎం హై స్కూల్‌లో బాపట్ల ఉప విద్యాశాఖ అధికారి ఎం వెంకటేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారి ఎస్ నిరంజన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బహుమతి ప్రదానోత్సవం ఎంఈఓ నిరంజన్ నిర్వహిం చారు. మండల స్థాయి ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు కె శుభారాణి గురుకుల పాఠశాల నరసాయపాలెం, ఎం జోష్ణ చెరువు జమ్ములపాలెం, ఎన్ నాగ బాజీ కాలేశా, చెరువు జమ్ములపాలెం, ఎస్ జోష్ణ ఎస్ఎంజి హై స్కూల్ బాపట్ల, ఎస్‌కె ఫెయిత్ మున్సిపల్ హైస్కూల్, మండల స్థాయిలో గెలిచిన ఎగ్జిబిషన్స్ జిల్లా స్థాయికి వెళ్లతాయన్నారు. మండల స్థాయిలో మొత్తం 15 ప్రాజెక్టులు రాగా ఐదు జిల్లా స్థాయికి సెలెక్ట్ అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల సైన్స్ కోఆర్డినేటర్ గవిని శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు విజయ్ శ్రీ, జయ, శ్రీ రత్న కళ, రమేష్, సుభాని, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'శ్రీ గౌతమి' విద్యార్థికి ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

విజేతగా నిలిచిన ఇంకొల్లు శ్రీ గౌతమి విద్యార్థి అనిల్

ఈ నెల 9,10,11 తేదీలలో జరిగిన జాతీయ స్థాయి 41వ బాలబాలికల షూటింగ్ బాల్ జూనియర్ అండర్-19 ఛాంపియన్‌షిప్ తెలంగాణ లోని ఆదిలాబాద్ జిల్లా డీఎస్‌ఏ స్టేడియంలో పోటీలు నిర్వహించారు. పోటీలలో 16 రాష్ట్రాల బాలబాలికలు జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీలలో ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రం మీద 15-9, 15-10 పాయింట్ల తేడాతో మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ విజయానికి శ్రీ గౌతమి జూనియర్ కాలేజ్ విద్యార్థి ఎస్ అనిల్ కృషి ఎంతో ఉంది. మంగళవారం జరిగిన అభినందన సభలో కళాశాల డైరెక్టర్ కాట్రగడ్డ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆటలు శారీరక, మానసిక ఉల్లాసానికి ఎంతో తోడ్పడతాయని పేర్కొన్నారు. మా కాలేజీ చదువుతోపాటు ఆటలకు కూడా ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్‌కే మోబిన, జి వెంకట రావు, జి నాగలక్ష్మి, పిడి పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణ

16న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-రేపల్లె

ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో 16వ తేదీన స్థానిక ఏబీఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తునారు. ఈ జాబ్ మేళా పోస్టరును రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్‌డిసి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాకు పది రకాల ప్రముఖ కంపెనీలు వస్తున్నాయి. కనుక రేపల్లె నియోజకవర్గంలో ఉన్న నిరుద్యోగ యువత ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు తెలిపారు.

సీఐటీయూ బాపట్ల జిల్లా ప్రథమ మహాసభలు జయప్రదం చేయండి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

సీఐటీయూ బాపట్ల జిల్లా ప్రథమ మహాసభలు జయప్రదం చేయాలని బాపట్ల జిల్లా సీఐటీయూ నాయకులు తిరుమలరెడ్డి తెలిపారు. మంగళవారం బాపట్ల మండలంలోని వెదుళ్లపల్లి పరిసర గ్రామాల్లో మహాసభ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వర్లు రెడ్డి, దినేష్ కుమార్, రాహేలు, కోటేశ్వరి, సుమలత, జయమ్మ, రూతమ్మ పాల్గొన్నారు.

మాండూస్ తుఫాను వలన బాపట్ల నియోజకవర్గంలోని అప్పికట్ల, మర్రిపూడి, పుండ్ల, గోపాలపురం ప్రాంతాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్టపోయిన రైతులను పరామర్శించి ధైర్యం చెప్పిన బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ, తుఫాన్ వలన నష్టపోయిన రైతులను తక్షణమే తగు నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

- ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఆగని వర్షం

- రైతులను ముంచిన మాండూస్ తుఫాను
- పరిహారం ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి-రేపల్లె

రేపల్లె ప్రాంతంలో పడుతున్న వర్షాలకు పంట పొలాలు నీట మునిగాయి. దీంతో రైతన్నలు నిస్సహాయ స్థితిలో ఉన్నారు. నియోజకవర్గంలో రేపల్లె, భట్టిప్రోలు, నగరం, నిజాంపట్నం మండలాల్లో తుఫాను ప్రభావంతో అధికంగా వర్షం పడింది. దీంతో ఆయా మండలాల్లోని వరి, మినుము, పంట పొలాలు వర్షపు నీటితో మునిగాయి. రేపల్లె మండలంలో వరి వేలాది ఎకరాల్లో రైతులు సాగు చేపట్టారు. వరి తర్వాత మొక్కజొన్న మినుము, పెసర, వేరుశనగ చిన్న మొక్కగా ఉండటంతో వర్షపు నీరు పొలాల్లో నిలవటంతో పంటలు ఉరకెత్తి మొక్కలు కుళ్లిపోయే స్థితికి చేరుకున్నాయి. గడిచిన 3,4 రోజులుగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం కొన్ని ప్రాంతాల్లో తెరిపినిచ్చిన వాన.. కాసేపటికే మళ్లీ జోరందుకుంది. తేలికపాటిగా మొదలై క్రమంగా భారీ వర్షంగా మారింది. రాత్రి నుంచి చాలా ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. భారీ వర్షాలకు కారణంగా పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. దీంతో రైతులు నానా తండాలు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుందో లేదో అని ఆర్బికేల చుట్టూ తిరుగుతున్నారు. ఆర్బికెల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పినప్పటికీ నియోజకవర్గంలో ఇంతవరకు అమలు కాలేదు. మాసూలు చేసిన రైతులు చేసేది లేక దళారులకు వెయ్యి రూ.1000, రూ.1100కే రైతులు ధాన్యాన్ని అమ్ముతున్నారు. పంటలు నష్టపోయిన రైతులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని, పరిహారం అందించాలని, తర్వాత పంటలకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించి వారికి సహాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

రేపల్లె మండలంలో తడిసిన ఓదెలను కట్టలు కడుతున్న కూలీలు

బల్లికురవ: మండూస్ తుపాను మండలంలోని మాగాణి పంటలపై తీవ్ర ప్రభావం చూపించిందని మండల వ్యవసాయాధికారి ఎస్‌విపి కుమారి అన్నారు. మంగళవారం పలు గ్రామాల్లోని మాగాణి పంటలను పరిశీలించారు. ముఖ్యంగా వరి పంట 350 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా అంచనా వేసి ప్రభుత్వానికి పంపినట్లు ఆమె చెప్పారు. ప్రధానంగా వైదన, ముక్తేశ్వరం కొప్పెరపాడు, కెవి పాలెం పలు గ్రామాలలో వరి పంటకు ఎక్కువ నష్టం జరిగిందని అన్నారు. వరి పంట కోత దశలో ఉన్న 200 ఎకరాలతో బాటు మరో 150 ఎకరాల్లో ఓదెల రూపంలో ఉన్నట్లుగా ఆమె చెప్పారు. మినుము, శనగ, మొక్కజొన్న వంటి పంటలను కూడా పరిశీలించాల్సి ఉందని అన్నారు. వీటికోసం ప్రత్యేక కమిటీలను వేసి ఆయా గ్రామాల్లో నష్టం అంచనా వేస్తామని ఆమె తెలిపారు.

పర్చూరు: మండూస్ తుఫాన్ కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు శనగ, వరి, పొగాకు పంటలు దెబ్బతినటంతో రైతులు ఎవరైనా దున్ని మరలా శనగ పంట వేసేటట్లయితే వారికి ప్రభుత్వం 80 శాతం రాయితీపై శనగ విత్తనాలు ఇస్తుందని మండల వ్యవసాయాధికారి రామమోహన్‌రెడ్డి వివరించారు. ఎవరైనా రైతులు పంట వేసి నష్టపోతే వారు తమ గ్రామ రైతు భరోసా కేంద్రం సిబ్బందిని సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వరి పంట నష్టపోయిన వారికి ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వనున్నట్లు తెలిపారు. పర్చూరు మండలంలో వరి పంట ఉప్పరపాలెం గ్రామంలో వేసిన 70 నుంచి 80 ఎకరాల వరకు నష్టపోయారని పేర్కొన్నారు. 80 శాతం రాయితీపై శనగ విత్తనాలు పొందాలంటే రైతు తప్పనిసరిగా నష్టపోయిన పంటను దున్ని మరలా శనగ పంట వేసే వారే అర్హులని రామమోహన్‌రెడ్డి వివరించారు.

పర్చూరు మండలం ఉప్పరపాలెంలో పొగాకు పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి రామమోహన్‌రెడ్డి

చెరుకుపల్లి: వర్షంతో నష్టపోయిన రైతుల వివరాలను పక్కాగా నమోదు చేయాలని రేపల్లె ఆర్‌డిఒ జె పార్థసారథి ఆదేశించారు. మంగళవారం చెరుకుపల్లి మండలంలోని పలు ప్రాంతాలలో పంట నష్టం వివరాలను ఆయన పరిశీలించారు. ప్రతి ఒక్క సిబ్బంది పంట నష్టం వివరాలను సక్రమంగా నమోదు చేయాలని, ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా రైతులందరికీ న్యాయం జరిగేలా చూడాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ సత్తార్, రేపల్లె ఏడి హుస్సేన్, తహసిల్దార్ టీ ప్రశాంతి, ఇన్చార్జి ఏవో మీరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ

చంద్రబాబును విమర్శించే స్థాయి 'కోన'కు లేదు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా: మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడును విమర్శించే స్థాయి, అర్హత బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతికి లేదని టిడిపి బాపట్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ పేర్కొన్నారు. మంగళవారం బాపట్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోన రఘుపతి వ్యాఖ్యలను ఖండించారు. కోన రఘుపతి తాను అధికార పార్టీ ఎమ్మెల్యేను అనే దురహంకారంతో స్థాయిని మరచి 40 ఏళ్ల రాజకీయ అనుభవం గల చంద్రబాబు నాయుడుని అవమానకరంగా మాట్లాడటం సభ్య సమాజం అసహ్యించుకునేలా ఉందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో నామీద పోటీ చేసి గెలవండి చూద్దాం అని చంద్రబాబు, లోకేష్‌లకు సవాల్ విసరటం సరికాదన్నారు. రోడ్డు విస్తరణ సాకుతో అక్కడ ఉన్న పెట్రోల్ బంక్ యజమానికి మాయమాటలు చెప్పి ఇంకా ఎక్కువ స్థలం ఇస్తామని మభ్యపెట్టి పెట్రోల్ బంక్ తీయించి తరువాత నీ వ్యాపారానికి అడ్డురాకుండా ఉండటానికి అతనికి స్థలం కేటాయించకుండా మోసం చేసి అతన్ని బజారు పాలు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. దళితులకు కేటాయించిన అసైన్డ్ భూములలో అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తవ్వకొని ప్రజాధనాన్ని కొల్లగొడుతూ ఒక ఇసుక మాఫియాను నడిపిస్తుంది మీరు కాదా అని ప్రశ్నించారు. మీరు చేసిన దౌర్జన్యానికి, అక్రమాలకు ప్రజలే మిమ్మల్ని సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తాతా జయప్రకాష్ నారాయణ్, చుండూరుపల్లి శివ, నాగ మల్లేశ్వరరావు, దయబాబు, ఇన్నకోట వీరయ్య నాయుడు, వసంతరెడ్డి, తోట నారాయణ, అఫ్జల్, జిట్టా ప్రమీల రాణి, రుక్మిణి, పరిసే గోపి, సురగాని శేఖర్, మద్దులా వీర కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం వివరాలపై శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-చెరుకుపల్లి: తుఫాన్ వలన నష్టపోయిన రైతులు వివరాలను సక్రమంగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ సత్తార్ సిబ్బందికి ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంట నష్టం వివరాల నమోదు గురించి సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల స్థాయిలో, గ్రామస్థాయిలో టీమ్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ అవగాహనతో పంట నష్టపోయిన వివరాలను సేకరించాలని కోరారు. తహశీల్దార్ టీ ప్రశాంతి, ఏడి హుస్సేన్, ఇన్‌ఛార్జి ఏవో మీరయ్య, ఏఈఓలు పాల్గొన్నారు.

నిరుపేదలందరికీ అండగా జగన్

'గడపగడపకూ'లో కరణం వెంకటేష్‌బాబు

ప్రజాశక్తి-వేటపాలెం: నిరుపేదలందరికీ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ అండగా ఉంటారని చీరాల వైసిపి ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్‌బాబు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వేటపాలెం సచివాలయం-3లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయం సిబ్బందితో ఇంటింటికీ వెళ్లి జగనన్న సంక్షేమ కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా వైసిపి అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. చీరాల, వేటపాలెం మండలాల్లో భవిష్యత్‌లో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంవిఎస్ శర్మ, వెలుగు ఎపిఎం బూదాటి శ్రీనివాసరావు, ఆర్‌బికే ఛైర్మన్ పల్లపోలు శ్రీనవాసరావు, అందే కృష్ణ, జంగిలి వెంకటరామారావు, సాధు రాఘవరావు, ఆవుల అశోక్, రొండా భరత్, జిడుగు మస్తాన్, కరణం మురళీకృష్ణ, రామన్నపేట సర్పంచ్ కె.రమణ, మున్నంగి అరుణకుమార్, కట్టా జార్జిశ్యామేల్, బాంబే సురేష్ పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన మాజీ మంత్రి

ప్రజాశక్తి-భట్టిప్రోలు (అమృతలూరు)

మాండూస్ తుఫాను కారణంగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న వరి పంటను మంగళవారం మాజీ మంత్రి, టిడిపి పొలిటీబ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు పరిశీలించారు. వేమూరు నియోజకవర్గంలోని అమృతలూరు, చుండూరు మండలాల్లో ఆయన రైతులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పొలాల్లో తడిసిన ధాన్యం మొలకలు వచ్చాయి. వర్షం ఇంకా కొనసాగుతూనే ఉంది. కోసిన పంట నీటిలో తెలియాడుతోంది. ప్రభుత్వమే ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గత నాలుగేళ క్రితమే టిడిపి ప్రభుత్వం హెక్టారుకు రూ.20 వేలు నష్టపరిహారం అందించిందని, దానిని మరింత పెంచాల్సిన జగన్ ప్రభుత్వం హెక్టారుకు రూ.15 వేలు మాత్రమే కేటాయించి రైతులను దగా చేసిందని విమర్శించారు. మొలకొచ్చినా, తడిసిన, రంగుమారిన ప్రతిగింజను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు భరోసాను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రైతులకు అన్యాయం జరిగితే టిడిపి చూస్తూ ఉరుకోదని మరో నాలుగు రోజులు వేసి చూస్తాం, ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని బట్టి కార్యాచరణ ఉంటుందన్నారు. అలాగే ఆర్‌బికెలు పెద్ద మోసం అన్నారు. ఈ క్రాఫ్ పెద్ద బూటకం అని పేర్కొన్నారు. ఈ ఏడాది రైతులు అధిక శాతం నాన్ బిపిటి సాగుచేయగా అధికారులు మొత్తం సాగు 90 శాతం పైగా బిపిటిగా ఈ క్రాఫ్ నమోదు చేశారని, దీని వలన రైతులు ధాన్యం అమ్ముకోవటానికి నానా తంటాలు పడాల్సిన దుస్థితి ఎదురుకాబోతోందని అన్నారు. ధాన్యం ఎన్ని రకాలుగా దెబ్బతిన్నా ప్రకటించిన మద్దతు ధరకే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈయన వెంట రెండు మండలాల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అమృతలూరులో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఆనందబాబు

ప్రజాశక్తి
బుధవారం 14 డిసెంబర్ 2022

తుఫానుతో రైతులకు అపార నష్టం

ముంపు ప్రాంతాలను పరిశీలించిన సిపిఎంనాయకులు

రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్

ప్రజాశక్తి-కొండపి

తుపాన్ కారణంగా కురిసిన వర్షాలకు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, బాధిత రైతులకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు కోరారు. తుఫాన్ కారణంగా మండల పరిధిలోని ముప్పవరంలోని ముంపుకు గురైన పొగాకు, శనగ పంట పొలాలలో సిపిఎం బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ వారం, పది రోజుల్లో పొగాకు కొట్టే అవకాశం ఉందన్నారు. వర్షాల కారణంగా పొగాకు మొత్తం దెబ్బతిన్నట్లు తెలిపారు. దెబ్బతిన్న పంటలను అంచనా వేసి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కెజి. మస్తాన్, రైతు సంఘం నాయకులు గుమ్మళ్ల వెంకటేశ్వర్లు, ముప్పరాజు చిన్నబ్రహ్మయ్య, ముప్పనేని శ్రీకృష్ణ, కొండ్రగంటి నారాయణ, కొల్లూరి నరసింహ, ఉపేంద్ర, ఆర్.రాఘవేంద్రరావు, పెద్ద వెంకటేశ్వర్లు, గడ్డం వందనం పాల్గొన్నారు. **పామూరు :** తుపాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు రైతులను తీవ్ర నష్టం వాటిల్లినట్లు సిపిఎం నాయకులు తెలిపారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను సిపిఎం నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలో మినుము 2,500 ఎకరాలు, శనగ 1,100 ఎకరాలు, బొబ్బర్లు 300 ఎకరాలు, పొగాకు 500 ఎకరాలు, మిర్చి 100 ఎకరాల్లో పంటకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు తెలిపారు. దూబగుంట్ల గ్రామంలో నాయకులు దెబ్బతిన్న మినుము పంటలను పరిశీలిస్తుండగా వర్షాలకు మినుము, బొబ్బర్లు, శనగ పంటలు నీట మునిగి విత్తనాలు ఉబ్బి మొలకెత్తుతున్నాయని రైతులు వేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వైవి. నారాయణ, సిఐటియు నాయకులు షేక్ అల్లాభక్షు, సిహెచ్.వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు బి.మహదేవయ్య, నాగేశ్వరావు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు : తుపాన్ ప్రభావంతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు ప్రభుత్వమే ఆదుకోవాలని టిడిపి మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, తెలుగు రైతు కనిగిరి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గాయం రామిరెడ్డి కోరారు. పంటలు దెబ్బతినడంతో ఏమి చేయాలో పాలుపోక రైతులు ఆందోళన చెందుతున్నట్లు వారు పేర్కొన్నారు. తుపాన్ కారణంగా కంది, మినుము, బొబ్బర్లు, పొగాకు, మిర్చి పంటలు సాగు చేసిన రైతులు పూర్తిగా నష్టపోయి నట్లు తెలిపారు.వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలని వారు కోరారు.

పామూరులో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న సిపిఎం బృందం

జరుగుమల్లి : తుఫాను ప్రభావంతో వందలాది ఎకరాల పొగాకు తోటలు వురకెక్కి పోవడంతో మండలంలోని కామేపల్లి, పైడిపాడు, నర్సింగోలు గ్రామాలలోని పొగాకు తోటలను ప్రకాశం జిల్లా పిడిసిసి బ్యాంకు చైర్మెన్ డా మాదాసి వెంకయ్య మంగళవారం పరిశీలించారు. రైతులకు పొగాకు నష్టాన్ని అంచనా వేసి వ్యవసాయశాఖ జేడీతో మాట్లాడి రైతులకు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని వెంకయ్య కోరారు. ఈ కార్యక్రమంలో జరుగుమల్లి మండల మాజీ వైసిపి కన్వీనరు పాటిబండ్ల నాగేశ్వరరావు, పైడిపాడు సర్పంచి నాగినేని భాస్కరచౌదరి, దగ్గుమాటి శంకరరెడ్డి, చాగంటి కొండయ్య, దుంపా అనిల్‌కుమార్‌రెడ్డి, కొర్రకూటి వెంకటేశ్వర్లు,పాటడుగు జగదీష్, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఆంజనేయులు

పొన్నలూరు: కొండపి శాసనసభ్యుడు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దామచర్ల సత్య సూచనల మేరకు మండలంలో పంటలను నష్టపోయిన రైతుల వివరాలను మండల తెలుగుదేశం కార్యాలయంలో అందజేయాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అనుమల సాంబశివరావు పేర్కొన్నారు.

మార్కాపురం రూరల్ : మార్కాపురం నియోజకవర్గంలో మాండూస్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో మార్కాపురం మాజీ శాసనసభ్యుడు కందుల నారాయణ రెడ్డి రెండురోజులు పర్యటించారు. మంగళవారం మండల పరిధిలోని నాయుడు పల్లి గ్రామంలో తుఫాన్ వలన దెబ్బతిన్న మిర్చి మరియు బొబ్బర్ల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం నియోజకవర్గంలో ఉన్న మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల మరియు పొదిలి మండలాల్లో రైతులు అత్యధికంగా మిరప, పత్తి, బొబ్బర్లు, మినుము మరియు పొగాకు పంటలు సాగు చేశారని ఇప్పటివరకు రైతులు లక్షల్లో పెట్టుబడులు పెట్టారని ఈ అకాల వర్షాల వల్ల పంట పూర్తిగా తుడిచిపెట్టుకుపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడు నెలల కిందట కురిసిన అకాల వర్షాల కారణంగా రైతులు పంటలను కోల్పోయారని రాష్ట్ర ప్రభుత్వం తప్పక సాయం చేస్తామని చెప్పి రైతులకు సబ్సిడీ విత్తనాలు మాత్రమే అందించి చేతులు దులుపుకున్నారని ఎద్దేవా చేశారు. కానీ ఇప్పుడు తుఫాను వల్ల రైతులు భారీగా నష్టపోయారన్నారు. రైతుల ఆత్మహత్యలను నివారిం చాలంటే సంబంధిత అన్ని శాఖల అధికారులు సమన్వ యంతో పనిచేసి పంట నష్టపరిహారం అంచనాలు రూపొం దించాలని రాష్ట్ర ప్రభుత్వం అందజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం నాయకులు, రైతులు పాల్గొన్నారు. **పామూరు :** మాండుస్ తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతులను అంచనా వేసి ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు మాజీ జడ్‌పిటిసి సభ్యులు బొల్లా మాల్యాద్రి చౌదరిలు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం బొట్లగుండూరు ప్రాంతంలో దెబ్బతిన్న మినుము పంటలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు వేలకు వేలుఖర్చు పెట్టి పండించినపంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షం వారి పాలిట శాపంగా మారిందన్నారు. ప్రభుత్వం అంచనావేసి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో అడుసుమల్లి ప్రభాకర్, యం రమణయ్య, దేవరపు మాల్యాద్రి, షేక్ రహంతుల్లా, ఇర్రి కోటిరెడ్డి, వీరబాబు, పాల్గొన్నారు. **చీమకుర్తి :** మండలంలో గత వారంగా కురుస్తున్న అకాల వర్షాల వలన పంటలు దెబ్బతిన్నాయి.ప్రధానంగా పొగాకు తోటలు ఉరకలెత్తి వాడుతున్నాయి.తోటల్లో మోకాటి లోతు నీరు నిలబడడంతో మొక్కలు కుళ్ళి పోవడం,వాడిపోవడంతో రైతులు దిగాలుపడ్డారు.పొగాకు సాగు చేసేవారిలో కౌలు రైతులే ఎక్కువ మంది ఉన్నారు.కౌలు రైతులు ఎకరాలకు కౌలు రు.10వేలు,ఖర్చులు రు.20వేలు ఖర్చు పెట్టారు.వర్షాలు కారణంగా పెట్టుబడులు వర్షార్పణం అయింది.దీంతో రైతులు అల్లాడుతున్నారు.మండలంలో 1100 ఎకరాలు పొగాకు సాగు చేశారు.దాదాపు 80శాతం తోటలు దెబ్బతిన్నాయి.కెవిపాలెంలోనే 100 ఎకరాలు సాగుచేశారు.కూనంనేనిసుధాకర్ 11 ఎకరాలు సాగు చేస్తే పూర్తిగా తోట ఉరకలెత్తింది.మండలంలో శెనగ 650 ఎకరాలు,అలసంద 280 ఎకరాలు,మినుము 320 ఎకరాలు,మొక్కజొన్న 180 ఎకరాలు,వరి 200 ఎకరాలు,మిరప 300 ఎకరాలు నీటి మునిగినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.మంగళవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు కొల్లూరివెంకటేశ్వర్లు పొగ తోటలను పరిశీలించారు.ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల వలన పంటలను నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకొని,సహాయం అందించాలని కోరారు.**దర్శి :** వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు కోరారు. మండలంలోని తూర్పుచౌటపాలెం గ్రామంలోని వర్షానికి దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వమే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి నగరపంచాయతీ చైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య, టిడిపి మండల అధ్యక్షుడు చిట్టె వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, తిరుపతిరావు, మధు, గాలయ్య, కోటేశ్వరరావు, శ్రీను, దినకర్, రంగయ్య, వెంకటస్వామి పాల్గొన్నారు. అదేవిధంగా ఎపి రైతు సంఘం దర్శి డివిజన్ కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి తాండవ రంగనాయకులు మండలంలోని చందలూరు గ్రామంలోని నష్టపోయిన పంటలను పరిశీలించారు. గ్రామానికి చెందిన సుంకర యల్లారావుకు చెందిన ఉరకలెత్తిన పొగాకు పంటను పరిశీలించారు. కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్లూరి కొండారెడ్డి శామంతపూడి గ్రామంలో నష్టపోయిన వరి, మిరప పంటలను పరిశీలించారు. **టంగుటూరు:** తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు పొగాకు,శనగ, మినుము, మిర్చి, పత్తి పంటలు నష్టపోయిన కౌలు రైతులకు నష్టపరిహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కొణిజేడు గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న పలు పంటలను ప్రజాసంఘాల నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొలం యజమాని కౌలుతో కలిపి పొగాకు, మిర్చి సాగుకు ఎకరానికి రూ1లక్ష పెట్టుబడి అయిందన్నారు. పంట చేతికొస్తున్న దశలో తుపాన్ రైతులను నిలువునా ముంచిందనివేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వాస్తవంగా ఉన్న కౌలు రైతులకు వారి పేరు మీదనే ప్రభుత్వం నష్టపరిహారం నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కె సౌమ్య, ప్రజాసంఘాల నాయకులు గంటెనపల్లి శ్రీనివాసులు, వేశపోగు మోజెస్, టంగుటూరి రాము, ఎస్.కె మీరాస్, రైతులు పాల్గొన్నారు.

పొదిలి : తుపాన్ కారణంగా మండలంలో సుమారు 5000 ఎకరాల్లో బొబ్బర్లు మినుము పంటలు దెబ్బతిన్నట్లు ఎఒ జైనులా బ్దిన్ వివరించారు. మండల పరిధిలోని మాదాలవారిపాలెం, కంభాలపాడు, రామాపురం, అక్కచెరువు, ఉన్నగు ఉరవాయపాలెం, మూగచింతల గ్రామాల్లో బొబ్బర్లు పంటకు తీవ్ర నష్టం జరిగినట్లుఆయన తెలిపారు. నష్టం వివరాలను అంచనా వేసి నివేదికలు ప్రభుత్వానికి పంపనున్నట్లు ఆయన తెలిపారు.

హనుమంతునిపాడు : తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి మినుము, బొబ్బర్లు, అలసందలు మొలకలు వచ్చాయని నట్లు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు తెలిపారు. కనిగిరి, వెలిగండ్ల, హనుమంతుడుపాడు మండలాల్లో తుపాన్ కారణంగా నష్టపోయిన పంటలను నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా కౌలు రైతులను ఆదుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పిల్లి తిప్పారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యుడు ఆంద్ర కనకరాజు, రైతులు మొలకపాటి నారాయణ, పగడాల వెంకటేశ్వర్లు,లక్కిరెడ్డి మురళి, నల్లగర్ల కొండమ్మ, రిటైర్డ్ ఉపాధ్యాయులు కోటపాటి శేషయ్య పాల్గొన్నారు. **బేస్తవారిపేట:** తుపాన్ కారణంగా మండలంలో 2,532 ఎకరాల్లో పత్తి ,మినుము, మొక్కజొన్న, వరి, పప్పు శనగ పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు ఎఒ జక్కం మెర్సీ మంగళవారం తెలిపారు. మండల పరిధిలోని మోక్షగుండం ,ఎంపి చెరువు, గలిజేరుగుల్ల , సలకలవీడు , ఆర్.కొత్తపల్లి గామాల్లో దెబ్బతిన్న వరి మొక్కజొన్న ,పప్పు సెనగ, మినుము, పంటలను పరిశీలించారు. **కొనకనమిట్ల :** మండల పరిధిలోని కాట్రగుంట పంచాయతీలో తుపాన్ కారణంగా మినుము, బొబ్బర్లు ,వరి, పొగాకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మినుము, బొబ్బర్లు పంటలు 15, 20 రోజుల్లో చేతికి అందాల్సిన తరుణంలో వర్షం కారణంగా తడిసి మొలకలు ఎత్తాయి. విత్తనం రంగు మారిపోయింది.దీంతో రైతులు లబోదిబో మంటున్నారు. **తర్లుపాడు:** తుఫాన్ వలన దెబ్బతిన్న మిర్చి తదితర పంటలను మార్కాపురం ఎడిఎ రమాదేవి మంగళవారం పరిశీలించారు. దెబ్బతిన్న పంటల విలువను అంచనా వేసి ప్రభుత్వం దష్టికి తీసుకెళతా మన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె మండలంలోని కలుజువ్వలపాడు గ్రామంలో మిర్చి పంటను పరిశీలించారు. ఆమెతోపాటు మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు. **వెలిగండ్ల:** తుపాన్ కారణంగ పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎంపిపి రమణ మహాలక్ష్మి కోరారు. మంగళవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొని ఆమె మాట్లాడుతూ మండలంలో రైతులు ఏఏ పంట నష్టపోయారు వాటన్నిటిని పరిశీలించి ఈ క్రాప్ చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపించాలని ఆమె తెలిపారు. మండలంలో ఏ రైతు నష్టపోకూడదని వారి నాదుకోవాల్సిన అవసరం మనకు ఎంతైనా ఉందని అని అన్నారు. ఎక్కువగా మినుము రైతులు నష్టపోయారని,కంది పూత రాలిపోయిందని,శనగ పంట పూర్తిగా నీటిలో నిండిపోయింది అని వారన్నారు. మండలంలోని ప్రతి పై రెండు లెక్క వేసి వారి ఆదుకోవాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి రామన తిరుపతిరెడ్డి, నాగూర్‌యాదవ్, దేవసహాయం, సింగిల్ విండో అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వర్లు, వ్యవసాయ అధికారి రంగకష్ణ, తహశీల్దార్ నాగార్జునరెడ్డి, ఎంపిడిఓ తాతపూడి సుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొణిజేడులో మిర్చి పంటను పరిశీలిస్తున్న నాయకులు

దెబ్బతిన్న మిర్చిపంటను పరిశీలించిన ఎమ్మెల్యే కుందురు

తర్లుపాడు : తుపాన్ కారణంగా దెబ్బతిన్న కల్లాలోని మిర్చిని, ఇతర పంటలను ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి పరిశీలించారు. ఎడతెరిపి లేని వర్షం కారణంగా కల్లాలోని మిర్చికి బూజు పట్టినట్లు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పంటల నివేదికను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సూరెడ్డి భూలక్ష్మిసుబ్బారెడ్డి, మార్కాపురం జడ్‌పిటిసి బాపనరెడ్డి, సర్పంచి తాటికొండ ఆంజనేయులు, వైసిపి మండల కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, ఎంపిటిసి దేవిరెడ్డి పార్వతి, రమేష్‌రెడ్డి, వైసీపీ నాయకులు దేవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, యక్కంటి రామిరెడ్డి, తాటికొండ దాసయ్య పాల్గొన్నారు.

తుఫాన్ కారణంగా దెబ్బదిన్న మిర్చిని పరిశీలించిన ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి

ర్యాగింగ్ చట్టరీత్యానేరం : డిఎస్‌పి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

కళాశాలలో ర్యాగింగ్ అనేది చట్టరీత్యానేరమని, ర్యాగింగ్ చట్టాలు, శిక్షలు గురించి ప్రతి ఒక్క విద్యార్థి తప్పక అవగాహన కలిగి ఉండాలని మార్కాపురం డిఎస్‌పి డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జార్జ్ ఇంజినీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కన్వెన్షన్ 2022 - 23వ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ రాజబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మార్కాపురం డిఎస్‌పి డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ అనే అసాంఘిక కార్యక్రమాన్ని విద్యార్థులు ఎవరు ప్రోత్సహించ రాదన్నారు. ర్యాగింగ్ చేసిన వారికి 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థులను సీనియర్ విద్యార్థుల మధ్య సోదర భావాన్ని పెంపొందించే విధంగా కళాశాలలు చొరవ చూపాలన్నారు. అలాగే చెడు

మాట్లాడుతున్న డిఎస్‌పి డాక్టర్ మహంతి కిషోర్‌కుమార్

వ్యసనాలు కలిగిన వారితో స్నేహం చేయడం వలన కలిగే అనర్థాలు గురించి విద్యార్థులకు లఘు చిత్రాల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఎం.భీమానాయక్, గ్రామీణ ఎస్ఐ ఆర్.సుమన్, కళాశాల డీన్ మస్తాన్‌య్య, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, కళాశాల క్రమశిక్షణ కమిటీ వైస్ ఛైర్మన్ డాక్టర్ పి.శ్రీనివాసులు విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి పోటీలకు పాకల విద్యార్థి

ప్రజాశక్తి -శింగరాయకొండ

రాష్ట్ర స్థాయి త్రో బాల్ పోటీలకు పాకల హైస్కూల్ విద్యార్థి అప్పాడి జ్ఞానేష్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. శివాజీ తెలిపారు. ఈనెల 8న ఒంగోలు డిఆర్ఎం హైస్కూల్‌లో ఎస్‌జిఎఫ్ఐ అండర్-17 త్రో బాల్ ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో జ్ఞానేష్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పిల్లి హజరత్తయ్య తెలిపారు. ఈ సందర్భంగా జ్ఞానేష్‌ను పలువురు అభినందించారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని కోటగట్ల చెరువు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ డ్వామా పీడీ శీనారెడ్డిని ఆదేశించారు. దీంతో శీనారెడ్డి తగిన అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని యర్రగొండపాలెం ఎంపిడిఒ ఎం రామసుబ్బరంగయ్యను ఆదేశించారు. ఇటీవల యర్రగొండపాలెంలో జిల్లా స్థాయిలో స్పందన కార్యక్రమం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి కోటగట్ల చెరువుకు రిజర్వాయర్ నిర్మించడం మూలంగా రెండు వేల ఎకరాలకు సాగునీరు, మూడు గ్రామాలకు తాగునీరు, సుమారు ఆరు వేల బోర్లలో భూగర్భ జలమట్టం పెరిగే అవకాశం ఉన్నందున రిజర్వాయర్ నిర్మించి రైతాంగాన్ని ఆదుకోవాలని వినతి పత్రం అందజేశారు. స్పందించి కలెక్టర్ దినేష్ కుమార్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి తెలిపారు. కోటగట్ల చెరువుకు రిజర్వాయర్ నిర్మిస్తే రైతాంగానికి ఎంతో ఉపయోగం జరగనుందని ఆయన చెప్పారు.

దగ్ధమైన బ్యారన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కుందురు

పొగాకు బ్యారెన్ దగ్ధం

ప్రజాశక్తి-తర్లుపాడు

మండల పరిధిలోని సీతానాగులవరం గ్రామంలో సోమవారం రాత్రి తాటికొండ దాసయ్య, గ్రామ సర్పంచి తాటికొండ ఆంజనేయులుకు చెందిన పొగాకు బ్యారెన్ దగ్ధమైంది. దీంతో బ్యారెన్‌లోని పొగాకు పూర్తిగా దగ్ధమైంది. ఈ విషయం గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి అగ్ని ప్రమాదంలో దగ్ధమైన పొగాకు బ్యారెన్‌ను మంగళవారం పరిశీలించారు. ప్రమాదంలో రూ.6 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సూరెడ్డి భూలక్ష్మిసుబ్బారెడ్డి, మార్కాపురం జడ్‌పిటిసి బాపనరెడ్డి, వైసిపి మండలకన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, మీర్జాపేట ఎంపిటిసి దేవిరెడ్డి పార్వతి, రమేష్‌రెడ్డి,గొల్లపల్లి సర్పంచి యక్కంటి రామిరెడ్డి, వైసిపి నాయకుడు దేవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

ప్రజాశక్తి-వెలిగండ్ల

వెలిగండ్ల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్నటువంటి ఉపాధ్యాయుడు పాపబత్తిని శ్రీరాములు అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మతి చెందారు. ఉపాధ్యాయుల మతి బాధాకరమని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూలమాలలు వేసి నివాళులర్పించిన వారిలో మండల విద్యాశాఖ అధికారి దాసుప్రసాద్, బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు రిటైర్డ్ ఉపాధ్యాయులు కోటపాటి శేషయ్య, సిఐటియు నాయకులు రాయల మాలకొండయ్య, మెడికల్ అండ్ హెల్త్ రిటైర్డ్ నాయకులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ఈ సందర్భంగా బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా ప్రజల్లో సుపరిచితుడుగా ఉంటూ ప్రతి ఒక్కరికి కుటుంబ సభ్యుడిగా నడుచుకుంటాడని మంచి స్నేహభావం కలిగిన

శ్రీరాములు మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న బడుగు వెంకటేశ్వర్లు

వ్యక్తిగా అందరితోటి ప్రేమ తో ఉన్నటువంటి శ్రీరాములు మరణం బాధాకరమన్నారు. వీరి భార్య బాల చిన్నమ్మ ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. ఒక కుమారుడు సచివాలయం ఉద్యోగిగా పనిచేస్తున్నారు. వీరి మృతికి సంతాపం తెలిపారు.

ప్రభుత్వ భూమిపై భూస్వాముల కన్ను

ప్రజాశక్తి-వెలిగండ్ల

పేదల సాగు చేసుకుంటున్నా ప్రభుత్వ భూమి మీద భూస్వాములు కన్ను వేశారని మండల సిపిఎం నాయకులు రాయల మాలకొండయ్య మంగళవారం అన్నారు. రామలింగాపురం గ్రామంలో 2008 నుంచి భూస్వాములకు కొంతమంది గ్రామస్తులు సహకారంతో భూములు కొల్లగొట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని, సీలింగ్ చట్టం క్రింద 1967 నుంచి 1997 వరకు ఉన్న భూములను భూమిలేని నిరుపేదలు ఇవ్వాలని, పట్టాదారులు సాగులో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బొర్రా బాలకోటిరెడ్డి, రాయల పెద్దపిచ్చయ్య, రాయల చెంచునారాయణ, మాదిరెడ్డి నాగార్జున, జక్కిరెడ్డి బాలవెంకటరెడ్డి, గజ్జల నాగలక్ష్మి, రాయల శేషయ్య,

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాయల పెదనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరాయిపాలెంలో నీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మేజర్ గ్రామ పంచాయితీ పరిధిలోని వీరాయిపాలెం గ్రామంలో మంచినీటి సమస్య అధికమైంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో యర్రగొండపాలెంలో జరిగిన స్పందన కార్యక్రమంలో సమస్యను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌కు వీరాయిపాలెం గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. ఈ క్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ వెంటనే సమస్యను పరిష్కరించాలని పంచాయితీ అధికారులను ఆదేశించారు. దీంతో పంచాయితీ కార్యదర్శి ఈదుల రాజశేఖర్‌రెడ్డి ఒక ప్రైవేటు వ్యక్తికి సంబంధించిన బోరును నెలకు రూ. 30 వేలు చొప్పున అద్దెకు తీసుకొని ఆ బోరు ద్వారా వీరాయిపాలెంకు నీటిని సరఫరా చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. మంగళవారం నుంచే

పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

గ్రామస్తుల నీటి సమస్యను పరిష్కరించేందుకు తగిన ఏర్పాటు చేశారు. దీంతో వీరాయిపాలెం గ్రామస్తులు మంత్రి సురేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి ఈదుల రాజశేఖర్‌రెడ్డి, ఎంపిటిపి యల్లయ్య, వీరాయిపాలెం గ్రామస్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఇఒ విజయభాస్కర్

ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు

హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు మంగళవారం ప్రారంభించారు. ఈ శిక్షణా తరగతులను డిఇఒ బి విజయభాస్కర్ ప్రారంభించారు. కొండపి, శింగరాయకొండ, జరుగుమల్లి, పొన్నలూరు మండలాలకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శిక్షణా తరగతులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ తొమ్మిది రోజులపాటు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు ప్రధానోపాధ్యాయులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ శివన్నారాయణ, జిల్లా రిసోర్స్ పర్సన్లు చంద్రశేఖర్, శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయురాలు భారతి, సిఆర్‌సి కూతల వంశీ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి-పిసిపల్లి

మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి అత్తాల జష్న్య అధ్యక్షతన బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ డి.వి.రమణారెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిటిసిలు, జడ్‌పిటిసి, సర్పంచులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

21లోపు జాబితా తయారు చేయాలి

ప్రజాశక్తి-పిసిపల్లి

తుపాన్ కారణంగా దెబ్బతిన్న పంటల నష్ట జాబితాను ఈనెల 21లోపు తయారు చేయాలని పిసిపల్లి ఎఒ జి.వెంకటస్వామి తెలిపారు. వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి పంట నష్ట జాబితా తయారు చేయాలన్నారు. 26న గ్రామసభ నిర్వహించి రైతుల పంట నష్టం జాబితాను బహిరంగ పరచనున్నట్లు ఆయన తెలిపారు.

సైన్సు ప్రదర్శనను ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రతిభ వెలికితీసేందుకే సైన్సు ప్రదర్శనలు

ప్రజాశక్తి-కొండపి

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందకు సైన్సు ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ కె.సురేఖ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్సుప్రదర్శనను నిర్వహించారు. ఉన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ ఆర్.శ్రీలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి ఈ ప్రదర్శనను ప్రారంభించారు. తొలుత పాఠశాల విద్యార్థిని మోక్ష సాయి ప్రదర్శించిన భరతనాట్యం ఆకట్టుకుంది. మండల పరిధిలోని ప్రభుత్వ మరియు ప్రైవేటు ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు సైన్సు ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు సైన్సు ప్రయోగాలు, ప్రాజెక్టులను ప్రదర్శించారు. మండల ప్రత్యేక అధికారి అన్నపూర్ణ సైన్సు ప్రదర్శనను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఎంఇఒ కె.సురేఖ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మామిళ్లపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తాగునీటి పైపు లైనుకు మరమ్మతులు

ప్రజాశక్తి-టంగుటూరు

పంచాయతీకి తాగు నీటిని సరఫరా చేసే పైపులైను వర్షాల కారణంగా పాలేరులో చేరిన వరద ఉధతికి కొట్టుకుపోయింది. స్పందించిన టంగుటూరు సర్పంచి మద్దిరాల మమత పంచాయతీ ప్రజలు మంచినీటికి ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో పంచాయతీ కార్యదర్శి నర్రా జగదీష్ బాబు సహకారంతో వెంటనే పైపు లైన్‌కు అత్యవసరంగా మరమ్మతులు మంగళవారం పనులు చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి మక్కెన కోటేశ్వరరావు, వార్డు సభ్యుడు కామని వెంకట్రావు, నాయకుడు మద్దిరాల వెంకట్రావు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-పంగులూరు: మాండూస్ తుఫాను వల్ల నష్టపోయిన రైతులందరికీ, తక్షణమే ప్రభుత్వం ఎన్యూమరేషన్ చేసి, నష్టపరిహారం ఇవ్వాలని, రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సబ్సిడీ విత్తనాలు ఇచ్చినంత మాత్రాన రైతులకు ఒరిగేదేమీ లేదని, రైతు కోలుకోవాలంటే నష్టపరిహారం ఇవ్వాలని అన్నారు. మంగళవారం పంగులూరులో, రైతు సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రైతు సంఘం, బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ, ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు సరఫరా చేస్తుందని అధికారులు చెబుతున్నారని, మరలా రైతులు వ్యవసాయం చేయాలంటే పొలాలు ఆరటానికి చాలా సమయం తీసుకుంటుందని, అప్పటికి సీజన్ అయిపోతుందని రామారావు అన్నారు. తుఫాన్ కారణంగా జిల్లాలో మినుము, పొగాకు, మొక్కజొన్న, శనగ, మిర్చి పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. మినుము పంగులూరు, మార్టూరు, కోరిసపాడు మండలాల్లో దెబ్బతిని పోయిందన్నారు. అక్టోబర్ నెలలో కురిసిన భారీ వర్షాలకు, ముందుగా వేసిన మినుము దెబ్బతిని పోగా, తర్వాత వేసిన మినుము ఇప్పుడు ఈ వర్షాలకు దెబ్బతిని పోయిందని చెప్పారు. బార్లీ పొగాకును ఈ ప్రాంతంలో సుమారు 7,500 ఎకరాల్లో రైతులు సాగు చేశారని, కొరిశపాడు మండలంలోని మూడు గ్రామాల్లో మాత్రమే బేరని పొగాకు సాగు చేశారని అన్నారు. పొగాకు మొత్తం వర్షాలకు దెబ్బతిని పోయిందని, గొడుగులెత్తిందని అన్నారు. మొక్కజొన్న కూడా ఈ ప్రాంతంలో 15 వేల ఎకరాల్లో సాగు చేశారని, ఎకరాకు 15,000 రూపాయలు పెట్టుబడి పెట్టారని, ఇది కూడా వర్షాలకు దెబ్బతిన్నదని అన్నారు. శనగ పంట పూర్తిగా నష్టపోయిందని, ఇది కోలుకునే పరిస్థితి కనిపించడం లేదని రామారావు చెప్పారు. ఖరీఫ్‌లో వేసిన మిర్చి పంట కూడా దెబ్బతిన్నదని అన్నారు. శనగ పంటకు 80 శాతం సబ్సిడీతో విత్తనాలు ఇస్తామని అధికారులు చెబుతున్నారని, అలా కాకుండా నష్టపరిహారం ఇవ్వాలని రామారావు అన్నారు. మిగతా పంటలను ఈక్రాప్ చేసి, పంటల బీమా సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, రాయిని వినోద్ బాబు మాట్లాడుతూ, కౌలు కార్డులు లేకపోయినప్పటికీ, కౌలు రైతులందరికీ ఈ క్రాప్ చేయించాలని, నష్టపోయిన కౌలు రైతులందరినీ ఆదుకోవాలని కోరారు. జిల్లాలో భట్టిప్రోలు, పొన్నూరు, చెరుకూరు, ప్రాంతాల్లో మాగాణి రైతులకు కూడా, కౌలు కార్డు లేకుండా పంట కొనుగోలు చేయాలని, తడిసిన ధాన్యాన్ని తేమశాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని, ఈ ప్రాంతంలోని కౌలు రైతులందరికీ ఈక్రాప్ చేయించి, నష్టపరిహారం ఇవ్వాలని, వినోద్‌బాబు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు తలపనేని హనుమంతరావు, బాచిన రమేషు, బాచిన ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు

గుంతలమయంగా రహదారి

ప్రజాశక్తి-సంతమాగులూరు

సంతమాగులూరు నుంచి కొప్పరం గ్రామం వరకు ఉన్న ఆర్అండ్‌బి రహదారి అడుగడుగునా గుంతలమయంగా మారింది. సంతమాగులూరు నుంచి కొప్పరం వరకు పది కిలోమీటర్ల నిడివి గల ఈ రహదారిపై గత ఏడాది నుంచి గుంతలు పూడ్చే నాధుడే లేరా అని ప్రయాణికులు, వాహనాల డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి అద్దంకి నుంచి బల్లికురవ మీదుగా సంతమాగులూరు, నరసరావుపేటను కలుపుతుంది. ప్రతిరోజూ నరసరావుపేట నుంచి అద్దంకి వరకు ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయి. అంతేగాక నిత్యం ప్రయాణికులతో ఆటోలు, మోటార్ సైకిల్ లిస్టులు తిరుగుతుంటారు. రాత్రి సమయాల్లో ఆటోలు ప్రయాణికులతో గుంతలలో పడి క్షతగాత్రులకు గురవుతున్నారు. ఈ పది కిలోమీటర్లు ప్రయాణం చేయాలంటే నరకయాతన పడుతున్నామని ఇటువైపు వెళుతున్న ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని, ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అధ్వానంగా ఉన్న రహదారి



మాట్లాడుతున్న మణిలాల్

ఐక్య పోరాటాల ద్వారా సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-రేపల్లె: రేపల్లె సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ రేపల్లె మహాసభ జె ధర్మరాజు అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ మాట్లాడుతూ కార్మికులకు రోజువారీ సమస్యలు పెద్దఎత్తున పెరుగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పాలకులు ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించారని, అదేమని ప్రశ్నిస్తే అరెస్టులు, కేసులు పెట్టి జైలు పాలు చేస్తున్నారని అన్నారు. తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని పేర్కొన్నారు. అబద్ధాలతో పరిపాలన కొనసాగిస్తున్నారని, ప్రజలు చైతన్యవంతం కాకుండా వారి మధ్య మతాల పేరుతో చిచ్చులు పెడుతున్నారని అన్నారు. దేశంలో, రాష్ట్రంలో కనిపించని ఎమర్జెన్సీ విధించారని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయని, ఆ మేరకు కార్మికుల వేతనాలు పెరగకపోవడంతో కార్మికులు అప్పుల పాలు అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారని, నేడు దేశంలో నిరుద్యోగం తాండవిస్తుందని అన్నారు. మోడీ దేశంలోని ప్రజల కోసం కాకుండా కార్పొరేట్ శక్తులు అయిన ఆదాని, అంబానీల కోసం పనిచేస్తున్నాడని అన్నారు. మోడీ దుర్మార్గ పాలనను వ్యతిరేకించకుండా రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు మోడీకి భజన చేస్తున్నాయని అన్నారు, పాలకుల నిర్బంధాలకు వ్యతిరేకంగా కార్మికులు చైతన్యంతో సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. భవిష్యత్తు పోరాటాలు కార్యాచరణ రూపొందించటం కోసం చీరాలలో 16,17 తేదీలో జరిగే సీఐటీయూ బాపట్ల జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. మహాసభలో భాగంగా సిఐటియు నూతన కమిటీ 17 మందితో ఎన్నిక జరిగింది. అధ్యక్షులు జి ధర్మరాజు, ప్రధాన కార్యదర్శి కె ఝాన్సీ, కమిటీ సభ్యులుగా డి బుజ్జి, ఎల్ వెంకట్, డి శ్రీనివాసరావు, నిర్మల జ్యోతి తదితరులు ఎన్నికయ్యారు.

పటిష్ట లింక్డ్ క్రెడిట్ ప్లాన్ 2023-24 బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, అధికారులు

రైతు ఉత్పత్తి సంస్థలు మంజూరు: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలోని 6 మండలాల్లో రైతు ఉత్పత్తి సంస్థలు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ విజయ కష్ణన్ చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లో రైతు ఉత్పత్తి సంస్థల జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆరు రైతు ఉత్పత్తి సంస్థలు ఏర్పాటు చేయడానికి కమిటీకి ప్రతిపాదనలు వచ్చాయన్నారు. కమిటీ పరిశీలించి జిల్లాలో కొల్లూరు, చెరుకుపల్లి, వేమూరు, మార్టూరు, అద్దంకి, సంతమాగులూరు, మండలాల్లో రైతు ఉత్పత్తి సంస్థ కేంద్రాలు ఏర్పాటు చేయడానికి మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పటిష్ట లింక్డ్ క్రెడిట్ ప్లాన్ 2023-24ను ఆవిష్కరించారు. ఈ పటిష్ట లింక్డ్ క్రెడిట్ ప్లాన్ ఆధారంగా బ్యాంకులు క్రెడిట్ ప్లాన్స్ సిద్ధం చేయాలని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో నాబార్డు ఎల్‌డిఎం కెఆర్‌డి కార్తికేయ, జిల్లా సహకార అధికారి రామారావు, జిల్లా పరిశ్రమల శాఖ జిఎం మదన్ మోహన్‌శెట్టి, పశుసంవర్ధక శాఖ జెడి హనుమంతరావు, ఉద్యానవన శాఖ జెడి జెనెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శన

ప్రజాశక్తి-మేదరమెట్ల

కొరిశపాడు మండల పరిధిలో ఉన్న ఉన్నత పాఠశాలలకు సంబంధించి, మేదరమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అన్ని హైస్కూళ్లకు సంబంధించి సైన్సు ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లలు తయారు చేసిన సైన్స్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి ఈ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనకు పర్చూరు ఉప విద్యాధికారి ఏ కిరణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సైన్స్ సమాజంలో ఉన్న రుగ్మతలను ఎత్తిచూపుతుందని పేర్కొన్నారు. అంటే సమాజంలో ఉన్న మూఢ నమ్మకాలను తొలగించటానికి సైన్స్ అనేది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి సైన్స్ ఎడల మంచి ఆలోచన కలిగి ఉండాలని ఆయన ఉద్బోధించారు. ఈ సందర్భంగా వివిధ భాగాలలో ఎన్నికైన మొదటి ప్రైజులు సంపాదించుకున్న కె కావ్యశ్రీ జడ్పీహెచ్ దైవాలరావూరు, కె పూజశ్రీ జిల్లా పరిషత్ మేదరమెట్ల, కె హరికష్ణ జిల్లా పరిషత్, మేదరమెట్ల, పి హారిక, జిల్లా పరిషత్, తిమ్మన పాలెం, పి రోహిత హైస్కూల్ గీతం మేదరమెట్ల, వీరికి బహుమతులను అందజేశారు. వీరు జిల్లా స్థాయి సైన్స్ పోటీలకు అర్హత సాధించారు. ఈ కార్యక్రమం సైన్స్ ఉపాధ్యాయుడు కె పోతిరాజు ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు బి అంజయ్య అధ్యక్షతన జరిగింది.

భట్టిప్రోలు: మండల కేంద్రం భట్టిప్రోలు విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో మంగళవారం ఎంపిపి డివి లలితకుమారి, జెడ్పిటిసి టి ఉదయ్ భాస్కరి సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. సైన్సు విద్యార్థుల ఆలోచనా విధానాన్ని పెంపొందిస్తుందని అన్నారు. మానవ జాతి మనుగడ సైన్సుతో ముడిపడి ఉందన్నారు. విద్యార్థులు ఆసక్తితో సైన్సును అవలంబించుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి పులి లాజర్, పాఠశాల కరస్పాండెంట్ ఎంపి వెంకట్రావు, ఎగ్జిబిషన్ కో ఆర్డినేటర్ కె నిరీక్షణరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతలపాడు వృద్ధాశ్రమంలో మోక్షిత జన్మదిన వేడుకలు

వృద్ధాశ్రమంలో జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పర్చూరు

ఇంకొల్లుకు చెందిన ముద్దన రవికుమార్ దంపతుల కుమార్తె మోక్షిత 9వ జన్మదినోత్సవాన్ని పర్చూరు మండలంలోని నూతలపాడు ఆశ్రయ వృద్ధాశ్రమంలో ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. పండ్లు పంపిణీ చేశారు. జయలక్ష్మి రవికుమార్ దంపతులకు, మోక్షితకు ఆశ్రమ నిర్వాహకులు భవనం శ్రీనివాసరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అడుసుమల్లిలో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

అడుసుమల్లిలో కంటి పరీక్షలు

ప్రజాశక్తి-పర్చూరు

రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో పర్చూరు మండంలోని అడుసుమల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు ఉచిత కంటి వైద్యపరీక్షలు చేశారు. వారిలో 30 మందికి దృష్టి లోపం ఉన్నట్లుగా గుర్తించారు. అవసరమైన వారికి రోటరీ క్లబ్ వారిచే ఉచిత కళ్ల జోళ్లు త్వరలో అందజేస్తామని క్లబ్ అధ్యక్షులు నాగబైరు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు రోటరీ క్లబ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఉచిత నేత్ర వైద్య శిబిరంలో ప్రసాద్ కంటి వైద్యశాల వైద్యులు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, సభ్యులు కొల్లా సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-వేటపాలెం

స్థానిక బండ్ల బాపయ్య జూనియర్ కాలేజీలో చదువుతున్న జూనియర్ సీనియర్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు మంగళవారం ఇంగ్లీషు సాంస్క్రిట్ లాంగ్వేజ్‌లకు సంబంధించిన స్టడీ మెటీరియల్ అందించడం జరిగింది, హృదయ వెల్ఫేర్ అసోసియేషన్‌లోని సభ్యుడు పూర్వ విద్యార్థి అయిన పింజల సురేంద్ర యూఎస్ఏ పదివేల రూపాయలు ఖరీదు చేసే స్టడీ మెటీరియల్ బుక్స్ ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో హృదయ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బొగ్గుల శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ నన్నపనేని సునీల్ కుమార్, జనరల్ సెక్రటరీ గుగ్గిలం శ్రీహరి, సభ్యులు బుద్ధి శీను, మంకెన అరుణ్ కుమార్, బుద్ధి రవి, డివిఆర్ నాగరాజు, పెద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ప్రతిపాటి భాస్కర్, వై కోట వెంకట సోమరాజు, బొడ్డు సుబ్బారావు, కాలేజీ ప్రిన్సిపాల్ పి. బాలసుబ్రమణ్యం, గుత్తి కోటేష్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్‌జిఒ అసోసియేషన్ ఎన్నికలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. ఎన్నికల అధికారిగా నెల్లూరు జిల్లా అధ్యక్షుడు ఎం. పెంచలరావును ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు నియమించారు. సహాయ ఎన్నికల అధికారిగా ఎన్.వెంకట స్వామి వ్యవహరిస్తారు ఈ సందర్భంగా ఎన్నికల అధికారి ఎం.పెంచలరావు ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. జిల్లా సంఘ కార్యవర్గంలో అధ్యక్షుడు, సహాధ్యక్షుడు, ఐదుగురు ఉపాధ్యక్షులు, కార్యదర్శి, నలుగురు సంయుక్త కార్యర్శులు, మహిళా సంయుక్త కార్యదర్శి, కోశాధికారి కలిపి మొత్తం 14 పోస్టులకు నామినేషన్ ప్రక్రియ తేదీ బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు స్థానిక ఎన్‌జిఒ హోం జరుగు తుందన్నారు. ఎన్నిక ఏకగ్రీవమైతే అదే రోజు సాయంత్రం నూతన కమిటీని ప్రకటిస్తామని తెలిపారు. ఎన్నిక అనివార్యమైతే ఈనెల 21న ఎన్‌జిఒ హోంలోఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహిస్తామన్నారు. .

5న సర్పంచుల సమావేశం

ఒంగోలు కలెక్టరేట్ : సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలపై విజయవాడలో జనవరి 5న సమావేశం నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సర్పంచులు సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచి గౌరవ వేతనం రూ.5 వేల నుంచి రూ.15 వేలకు పెంచాలన్నారు.. ఈ సమావేశంలో సర్పంచులు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జి. వీర భద్రాచారి, జాస్తి వీరాంజనేయులు. అఖిల భారత పంచాయత్ పరిషత్ సర్పంచులు చౌదరి బాబు,అల్లాబక్షు,సాంబశివరావు పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి

గిద్దలూరు : గిద్దలూరు తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న రాజా రమేష్ ప్రేమ్ కుమార్‌కు డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రత్యేక జీవో ద్వారా జాబితా విడుదల చేసింది. ఈ సందర్భంగా రాజారమేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పలువురు తహశీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. జాబితాలో తాను కూడా ఉద్యోగోన్నతి పొందినట్లు తెలిపారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి -కొండపి

తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలను గుర్తించి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు, వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి, టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్య డిమాండ్ చేశారు. తుఫాన్ కారణంగా మండల పరిధిలోని కె.ఉప్పలపాడు గ్రామంలో దెబ్బతిన్న పొగాకు పంటలను టిడిపి బృందం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జి.రామయ్య చౌదరి, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఆర్.మధుసూదన రావు, టిడిపి మండల అధ్యక్షుడు బి.యలమంద నాయుడు, కాలేషా, రామూర్తి నాయుడు, సుబ్బరామయ్య పాల్గొన్నారు. **జరుగుమల్లి** : జరుగుమల్లి మండలం చిర్రికూరపాడు గ్రామంలో తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పొగాకు, శనగ పైరు పంటలను వ్యవసాయశాఖ మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి, కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, టిడిపి ఒంగోలు

జరుగుమల్లిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సోమిరెడ్డి

పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సోమినేని చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ తుఫాన్ కారణంగా నష్టపోయిన శనగ, పొగాకు, మిర్చి రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. రైతుల రుణాలు రీషెడ్యూలు చేయాలన్నారు. రైతులకు రూ.5 లక్షల రుణం బ్యాంకుల ద్వారా మంజూరు చేయాలని కోరారు. విత్తనాలు రైతులకు ఉచితంగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, ఏలూరి రాంబాబు, పెదబాబు, కొమ్మాలపాటి కృష్ణ, చందలవాడ బ్రహ్మేంద్రం, బత్తిన పూర్ణ, ఎనిమిరెడ్డి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు. **శింగరాయకొండ :** తుఫాన్ ప్రభావంతో పంటలు దెబ్బతిని నష్ట పోయిన రైతులను ఆదుకోవాలని వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి కోరారు. తుఫాన్ కారణంగా మండల పరిధిలోని కనుమళ్ల గ్రామంలో దెబ్బతిన్న మినుము పంట, శానంపూడి గ్రామంలో దెబ్బతిన్న మిర్చి పంటలను టిడిపి బృందం పరిశీలించారు. అనంతరం సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుకు ఏం చేశాడో చెప్పాలని నిలదీశారు. ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ వర్షంతో దెబ్బతిన్న పంటలను చూసేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలకు సమయం లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్య నారాయణ, టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు డాక్టర్ నూకసాని బాలాజీ, నాయకులు వేల్పుల సింగయ్య, గొర్రెపాటి రామయ్య చౌదరి, కోనపురెడ్డి వెంకట సుబ్బారావు, బైరపనేని మోహన్ రావు, చిగురుపాటి శేషగిరి, కనిగిరి వెంకటేశ్వర్లు, కల్లగుంట నరసింహ, ఒలేటి రవిశంకర్ రెడ్డి, సుదర్శి ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

కార్పొరేషన్ అధికారుల పనితీరు బాగాలేదు

- ప్రోటోకాల్ పాటించకుండా అవమానిస్తున్నారు
- కలెక్టర్‌కు 38వ డివిజన్ కార్పొరేటర్ మలగా రమేష్ ఫిర్యాదు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఒంగోలు కార్పొరేషన్ అధికారుల పనితీరు బాగాలేదని, తన డివిజన్‌లో జరిగే కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించకుండా తనను అవమానిస్తున్నారని 38వ డివిజన్ జనసేన పార్టీ కార్పొరేటర్ మలగా రమేష్ కలెక్టర్ దినేష్ కుమార్‌కు విన్నవించారు. తన డివిజన్‌లో నెలకొని ఉన్న సమస్యలు, వైసిపి నేతలతో కలిసి అధికారులు చేస్తున్న అవినీతి, అక్రమాలపై మంగళవారం ఆయన కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. డివిజన్‌ను అభివృద్ధి చేస్తానని ప్రజలు తనపై నమ్మకంతో ఓట్లేసి గెలిపించారని,

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్

అయితే మున్సిపల్ అధికారులు, వార్డు సచివాలయ ఉద్యోగుల తీరు తనను ఎంతో భాధిస్తోందని తెలిపారు. సచివాలయంలో జరిగే కొన్ని ప్రభుత్వ కార్యక్రమాలకు తనకు ఆహ్వానం అందడం లేదన్నారు. డివిజన్‌లో రూ.40 లక్షలు విలువైన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి తనను పిలవడం లేదన్నారు.తన డివిజన్‌లో ది క్లాత్ మర్చంట్ అసోషియేషన్ వెంచర్‌లో ఉన్న రిజర్వుడ్ స్థలానికి చుట్టూ ప్రహారి కట్టేందుకు పనులు ప్రారంభించిన అధికారులు పనులు మధ్యలోనే నిలుపుదల చేశారని తెలిపారు. కార్పొరేషన్‌కు చెందిన రిజర్వుడ్ స్థలాన్ని కాజేసే ప్రయత్నంలో భాగంగా వైసిపి నాయకులు ప్రహారి నిర్మాణ పనులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. సచివాలయ సెక్రటరీ పనితీరు బాగాలేదని ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కమర్షియల్ ఏరియాలో రెషిడెన్సియల్ ప్లాన్ తీసుకొని నిర్మాణాలు చేస్తున్నారని ఫిర్యాలు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధిగా తన డివిజన్‌లో ఉన్న సమస్యలపై నిరంతరం ప్రశ్నించే హక్కు తనకు ఉందన్నారు.అయితే కార్పొరేషన్, సచివాలయ ఉద్యోగుల తీరు తన హక్కును కాలరాసేలా ఉందన్నారు. కార్పొరేటర్ హోదాలో తనకున్న హక్కులను కాపాడాలని, కలెక్టర్‌కు విన్నవించారు. తాను ప్రస్తావించిన విషయాల పట్ల కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, ప్రోటోకాల్ సమస్య రాకుండా చూస్తానని హామీ ఇచ్చారని రమేష్ పేర్కొన్నారు.

రైతులను ఆదుకోవాలి

- టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్ధనరావు
- దెబ్బతిన్న పంటలను పరిశీలించిన టిడిపి బృందం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్ధనరావు కోరారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాలైన మండల పరిధిలోని వలేటివారిపాలెం కరవది, చేజర్ల, ఉలిచి గ్రామాలలో టిడిపి నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షానికి దెబ్బతిన్న పొగ తోటలు, పంట పొలాలు పరిశీలించారు. పంటలు నష్టపోయిన రైతులతో మాట్లాడారు. అనంతరం వ్యవసాయ శాఖాధికారులతో మాట్లాడి పార్టీలకు అతీతంగా ప్రతి రైతుకు నష్ట పరిహారం అందించాలని కోరారు. అనంతరం దామచర్ల జనార్ధనరావు

దెబ్బతిన్న పొగాకు పంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు

పాత్రికేయులతో మాట్లాడుతూ తుపాన్ కారణంగా ఒంగోలు మండలంలో రైతులు సాగు చేసిన పొగాకు, శనగ, మినుము తదితర పంటలు నీట మునిగాయన్నారు. దీంతో రైతాంగం తీవ్ర ఆవేదనలో ఉందన్నారు. పొగాకు ఎకరాకు రూ.20 వేల నుంచి 25 వేల వరకు నష్టం జరిగిందని రైతులు చెబుతున్నారన్నారు. మినుము,శనగ రైతులు కూడా పంటలు నీట మునగటంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు.ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసులు, టిడిపి నాయకులు బెజవాడ వెంకటేశ్వర్లు, పావులూరి చిరంజీవి, గోగినేని రామారావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం కల్పించాలని వినతి

ప్రజాశక్తి- కనిగిరి

కనిగిరి మండలం బొమ్మిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గుండ్లపాలెం గ్రామానికి రహదారి నిర్మించాలని కోరుతూ వామపక్ష నాయకుల ఆధ్వర్యంలో ఎంపిడిఒ మల్లికార్జున రావుకు మంగళవారం బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గుండ్లపాలెంలో 60 కుటుంబాల వారు నివసిస్తున్నట్లు తెలిపారు. వారికి గార్ల పేట కూచిపూడి రోడ్డు, తాళ్లూరు రోడ్డు నుంచి రోడ్డు సౌకర్యం లేదని తెలిపారు.దీంతో గ్రామస్తులు కాలిబాటనే రాకపోకలు సాగిస్తున్నట్లు తెలిపారు. గుండ్లపాలెం ఏర్పడి 75 ఏళ్లు పూర్తయినప్పటికీ ఇంత వరకూ రహదారి సౌకర్యం ఏర్పాటు చేయక పోవడం

ఎంపిడిఒకు నాయకుల వినతి

దారుణమని తెలిపారు. పాలకులు, ప్రజాప్రతినిధులు రహదారి ఏర్పాటు గురి పట్టించుకోలేదని తెలిపారు. వర్షాకాలంలో ప్రజలు గుండ్ల పాలెం నుంచి బయటకి వచ్చేందుకు కూడా వీలు కావడం లేదని తెలిపారు. రహదారి సౌకర్యం లేక బురదలోని రాకపోకలు సగిస్తున్న ట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుండ్ల పాలెం రహదారిని నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు పివి. శేషయ్య, పాలూరి రమణారెడ్డి కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా తయారైన రహదారి